WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టె ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 245 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | సోమవారం 1 సెప్టెంబర్ 2025 | వెల : 2-00




# విలక్షణ రాజకీయం



- చంద్రబాబు జీవితంలో ఎన్నో మలుపులు.. మరెన్నో మజిలీలు
- సంక్షోభాల నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన వైనం
- పాతాళానికి పడినా.. తర్వాత ఆకాశమే హద్దుగా ఎదిగే తత్వం
- ఊహకు అందని ఆలోచనలు..

విజయవాడ, స్వర్ణసాగరం

ఎవరైనా రాజకీయాల్లో గెలుస్తుంటారు.. ఓడిపోతుంటారు. మళ్లీ ప్రజాదరణ పొంది అధికార పీఠం అధిష్ఠిస్తారు. అయితే చంద్రబాబు అలా కాదు. సంక్షోభాల నుంచి ప్రపంచ స్థాయికి వెళ్లడం.. ఓటమితో చతికిలబడడం.. ఆ తర్వాత ఆకాశమే హద్దుగా ఎదగడం ఆయన రాజకీయ శైలి. ఆయనది ఆది నుంచీ విలక్షణమైన రాజకీయ జీవితం. మలుపులు.. మజిలీలు ఎన్నెన్నో ఉన్నాయి. అతి సాధారణ కుటుంబంలో జన్మించి.. విద్యార్థి దశలోనే గెలుపోటములు ఒంటబట్టించుకున్నారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై.. అంజయ్య హయాంలో మంత్రివర్గంలో చేరారు. టీడీపీలోకి వచ్చాక చాలాకాలం మంత్రి కావాలన్న ఆలోచనే చేయలేదు. 1983లో ఎన్టీఆర్ మొదటిసారి సీఎం అయ్యాక చంద్రబాబు టీడీపీలోకి వచ్చారు. 1984 ఆగస్టు సంక్షోభంలో తాను మామ చాటు అల్లుడిని కాదని.. నాయకత్వ పటిమ పదునుగా ఉందని నిరూపించుకున్నారు. 1985లో మళ్లీ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక.. అవకాశమున్నా.. ఎమ్మెల్యే, మంత్రి పదవుల జోలికి వెళ్లలేదు. కానీ రాష్ట్ర గతినే ఒక మలుపుతిప్పిన కర్షక పరిషత్ చైర్మన్‌గా దాదాపు - మిగతా3లో



# డ్రాగన్-ఏనుగు ఒక్కటవ్వాలి

- భారత్‌తో సంబంధాలపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీతో సమావేశం
- ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో సమావేశానికి ప్రాధాన్యం
- సరిహద్దు సమస్య భారత్-చైనా సంబంధాన్ని నిర్వచించనివ్వకూడదు
- స్నేహితులుగా ఉండటం, మంచి పొరుగువారిగా ఉండటం, డ్రాగన్, ఏనుగు కలిసి రావడం చాలా ముఖ్యం
- సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కొనసాగుతుందని ఆశిస్తున్నా:మోదీ

2

## పాక్ సరిహద్దు తీవ్రవాదంపై భారత్‌కు చైనా మద్దతు

- మీ బోర్డర్ దాటి వస్తున్న పాక్ టెర్రరిస్టుల సంగతేంటి?
- టెర్రర్ కార్యకలాపాల వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తాం
- ఎటువంటి ఉగ్రవాద చర్యల నిర్మూలనకైనా తమ మద్దతు ఉంటుంది
- టియాంజిన్ నగరంలో ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్న మోదీ..
- ప్రాంతీయ శాంతి, ఆర్థిక స్థిరత్వం, సరిహద్దు ఉద్రిక్తతల తగ్గింపు, సాంకేతిక రంగాల్లో సహకారం పెంచుకునే వంటి అంశాలపై చర్చలు
- వాణిజ్య, టెక్నాలజీ, రక్షణ రంగాల్లో ఒప్పందాలు చేసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# ఉధృతంగానే గోదావరి

- పోలవరం నుంచి 10.84 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ధవళేశ్వరంలో కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- లంక, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను తరలించిన అధికారులు





# బీచ్‌శాండ్‌పై కదలిక

- టెండర్లు ఖరారు చేయనున్న సర్కారు
- ముందు వరుసలో అదానీ కంపెనీలు
- హైకోర్టు సూచనల మేరకు నిబంధనల్లో మార్పులకు అవకాశం
- మరో 16 వేల హెక్టార్లలో లీజులకు కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

# డ్రాగన్-ఏనుగు ఒక్కటవ్వాలి

తియాన్‌జిన్ (చైనా)

డ్రాగన్, ఏనుగు ఒక్కటవ్వాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. బీజింగ్‌కు న్యూఢిల్లీ ఒక ముఖ్యమైన మిత్రుడని పేర్కొన్నారు. ఈ రెండు దేశాలు తమ బంధాన్ని వ్యూహాత్మకంగా, సుదీర్ఘకాల దృక్పథంతో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. చైనా పోర్టు నగరం తియాన్‌జిన్‌లో ఆదివారం ప్రారంభమైన రెండు రోజుల షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఆయన భారత ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. స్నేహితులుగా ఉండటం, మంచి పొరుగువారిగా ఉండటం, డ్రాగన్, ఏనుగు కలిసి రావడం చాలా ముఖ్యమని జిన్‌పింగ్ అన్నారు. సరిహద్దు సమస్య భారత్-చైనా సంబంధాన్ని నిర్వచించనివ్వకూడదని జిన్‌పింగ్ పేర్కొన్నట్టు ఆ దేశ పత్రిక జిన్హువా వెల్లడించింది. కాగా, భారత్-చైనా సరిహద్దు సమస్యపై న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేందుకు కలిసి పనిచేయడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అంగీకరించారు. పరస్పర విశ్వాసం, గౌరవం భారత్-చైనా సంబంధాలకు మార్గనిర్దేశం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గంటసేపు జరిగిన ఇరు నేతల సమావేశంలో సరిహద్దు ప్రతిష్టంభనపై ప్రత్యేక ప్రతినిధుల మధ్య ఒప్పందం నుంచి కైలాస మానససరోవర్ యాత్ర పునః ప్రారంభం, రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాల పునరుద్ధరణ వరకు ద్వైపాక్షిక సంబంధాలలో ఇటీవలి పురోగతిని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. 280 కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు ఈ రెండు దేశాల సహకారంతో ముడిపడి ఉన్నాయని, సర్వ మానవాళి సంక్షేమానికి ఇది మార్గదర్శనం చేస్తుందని మోదీ పేర్కొన్నారు. పరస్పర నమ్మకం, గౌరవం, సున్నితత్వం ఆధారంగా మన సంబంధాలను ముందుకు తీసుకువెళ్లడానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. కాగా, ఉగ్రవాదం, న్యాయమైన వాణిజ్యం వంటి ద్వైపాక్షిక, ప్రాంతీయ, ప్రపంచ సమస్యలు, ఉమ్మడి సవాళ్లపై బహుళపక్ష వేదికలకు విస్తరించడం అవసరమని ఇద్దరు నాయకులు భావించారని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

**సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కొనసాగుతుందని ఆశిస్తున్నా : ప్రధాని మోదీ**

పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం ఆధారంగా చైనాతో ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడానికి తాము కట్టుబడి ఉన్నామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో చర్చల సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల ప్రజల సంక్షేమం ఇరుదేశాల ద్వైపాక్షిక సహకారంతో ముడిపడి ఉందని అన్నారు. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఇవాళ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ సదస్సులో భాగంగా వీరి మధ్య భేటీ జరిగింది. ఏడేళ్ల తర్వాత చైనాలో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ.. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అమెరికా భారీ సుంకాల నేపథ్యంలో ఇరుదేశాల మధ్యనున్న విభేదాలను పక్కన పెట్టి, రెండు ఆసియా పొరుగు దేశాలు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

షాంఘై సహకార సంస్థ సదస్సు 2025 కోసం చైనాలోని తియాంజిన్ నగరానికి చేరుకున్న ప్రధాని..



అక్కడ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తోపాటు అనేక మంది ప్రపంచ నాయకులతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలోనే మోదీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. దాదాపు 10 నెలల తర్వాత ఈ ఇద్దరు నేతలు భేటీ అయ్యారు. చివరిసారిగా ఈ నేతలు రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో కలుసుకున్నారు.

2020లో గల్వాన్ లోయలో చోటుచేసుకున్న ఘర్షణల తర్వాత భారత్-చైనా సంబంధాలు మసకబారాయి. ఆ సంబంధాలు మళ్లీ సాధారణ స్థితికి రావడానికి ఈ భేటీ తోడ్పడుతుందని నిపుణులు భావిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలును సాకుగా చూపి ట్రంప్ విధించిన సుంకాల కారణంగా ఇరుదేశాలు ఒత్తిడికి గురవుతున్న సమయంలో ఈ సమావేశం కీలకంగా మారింది. మోదీ, జిన్‌పింగ్ మధ్య జరిగిన చర్చల్లో ఇరుదేశాల సంబంధాలను మెరుగుపరుచుకోవడమనేది ప్రధాన ఎజెండాగా ఉంది.

**ఏమిటీ పంచశీల ఒప్పందం?**

1954 ఏప్రిల్ 29వ తేదీన భారత్, చైనా అనుసరించాల్సిన విధానాలను ఐదు సూత్రాల నియమావళిగా రూపొందించారు. వీటిని పంచశీల సూత్రాలు అంటారు. అవి..

1. తోటి దేశ ప్రాదేశిక సమగ్రత, సారభౌమత్వాన్ని పూర్తిస్థాయిలో గౌరవించడం
2. ఆ దేశంపై దురాక్రమణకు పాల్పడకపోవడం
3. ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం
4. ఇరుదేశాల మధ్య సమానత్వం, ఉమ్మడి ప్రయోజనాల కోసం కృషిచేయడం
5. శాంతియుత సహజీవనానికి బాటలు వేయడం

**ఆంక్షలపై పోరాడుతాం: పుతిన్**

ట్రంప్ విధించిన వివక్షాపూరిత ఆంక్షలపై చైనా, రష్యా పోరాడుతున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. ఎస్‌సీఓ సదస్సు కోసం తియాంజిన్ సిటీకొచ్చిన ఆయన చైనా అధికారిక వార్తాసంస్థ జిన్‌హువాతో మాట్లాడారు. "అంతర్జాతీయ సవాళ్లను బ్రిక్స్ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా కీలక మౌలికసదుపాయాల ప్రాజెక్టుల నిర్వహణకు చైనా, రష్యా అదనపు వనరుల సమీకరణలో తలమునకలయ్యాయి. సామాజికఆర్థికాభివృద్ధికి అవరోధంగా మారినఅమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు చైనా, రష్యా సమష్టిగా పోరాడుతున్నాయి"అని పుతిన్ అన్నారు.

**మోదీ, జిన్‌పింగ్ భేటీ 'పది'నిసలు**

రష్యాలో బ్రిక్స్ సదస్సు తర్వాత తొలిసారిగా భేటీ అయిన మోదీ, జిన్‌పింగ్‌లు ఇకమీదటైనా ద్వైపాక్షిక ఒప్పందాల్లో పురోగతిని సాధించాలని నిర్ణయించారు
భారత్, చైనా మధ్య నేరుగా పౌరవిమానయాన సర్వీసులను విస్తరించాలని నిర్ణయించారు
కైలాస్ మానససరోవర్ యాత్ర కోసం భారతీయులకు యాత్రా వీసాలు ఇచ్చేందుకు చైనా ముందుకొచ్చింది
పరస్పర వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని గౌరవించుకుంటూనే మూడో దేశం జోక్యాన్ని ఏమాత్రం సహించకూడదని నిర్ణయించుకున్నారు
సరిహద్దు వెంట బలగాల ఉపసంహరణతో శాంతి స్థాపన సాధ్యమైందని నేతలు పునరుద్ఘాటించారు
భారత్, చైనా ఎప్పటికీ మిత్రులుగా, మంచి పొరుగుదేశాలుగా మెలగాలని జిన్‌పింగ్ అభిలషించారు
ఇరుదేశాల బంధాన్ని కేవలం సరిహద్దు వివాదం కోణంలో చూసే ధోరణిని విడనాడాలని నిర్ణయించుకున్నారు. వాణిజ్య, పెట్టుబడుల బంధాన్ని బలోపేతం చేయాలని కోరుకున్నారు
చైనా కంపెనీలకు భారత్‌లో అవకాశం ఇవ్వడం ద్వారా భారత్‌లో విద్యుత్‌వాహన రంగం సైతం వేగంగా విస్తరిస్తుందని ఇరునేతలు ఆశించారు
ఇటీవల చర్చల నిర్ణయాలకు అనుగుణంగా మూడు సరిహద్దుల గుండా సరకు రవాణా, వాణిజ్యానికి ద్వారాలు తెరవాలని మోదీ, జిన్‌పింగ్ నిర్ణయించారు
అధిక టారిఫ్‌లతో చెడిన అమెరికా బంధానికి బదులు పరస్పర బంధాన్ని బలపర్చుకుని అంతర్జాతీయంగా వాణిజ్యరంగంలో ఎదగాలని ఇరునేతలు కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

# ఇదేం 'మైత్రి'.. భారత్‌పై అమెరికా ధోరణి

పురాతన ప్రజాస్వామ్య దేశమైన అమెరికాకు, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు మధ్య ఉండాల్సిన సహజసిద్ధ మైత్రి అగ్రరాజ్య దుందుడుకు వైఖరి వల్ల కొన్నిసార్లు బలహీనపడుతోంది. తిరిగి ఆ సంబంధాలను గాడిలో పెట్టడానికి దశాబ్దాల సమయం పడుతోంది. వెరసి ద్వైపాక్షిక మైత్రిలో ఒక అడుగు ముందుకు.. ఒక అడుగు వెనక్కి పడుతోంది. సుంకాల ద్వారా మరోసారి స్నేహధర్మానికి అమెరికా తూట్లు పొడుస్తోంది. చరిత్ర పుటలను పరికిస్తే మనదేశం పట్ల అగ్రరాజ్యం తీరు ఇలాగే సాగినట్లు స్పష్టమవుతోంది. అక్కసుతో ఒకప్పుడు తుదముట్టిద్దామనుకున్న భారత రాకెట్‌నే ఆ తర్వాతి కాలంలో అమెరికా ఉపయోగించుకోవాల్సి రావడం.. అంతర్జాతీయ సంబంధాల విషయంలో ఆ దేశ అపసవ్య విధానాలకు నిదర్శనం.

**అప్పుడు 'నై'.. ఇప్పుడు 'సార్'!**

గత నెల 30న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి నైసార్ ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. భారత్, అమెరికాలు ఈ ఉపగ్రహాన్ని ఉమ్మడిగా రూపొందించాయి. దీన్ని మన దేశానికి చెందిన జీఎస్ఎల్‌వీ మార్క్-2 ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఇరు దేశాల మైత్రికి వారిధిగా నిలిచిన ఈ రాకెట్.. ఒకప్పుడు విభేదాలకు కారణమైంది. అది 1990ల నాటి మాట! అప్పట్లో భారత్.. తన అంతరిక్ష కార్యక్రమం కోసం రాకెట్లను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా జీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రాజెక్టును కూడా చేపట్టింది. ఈ వాహకనౌకలోని ఎగువ దశలో క్రయోజెనిక్ ఇంజిన్ పరిజ్ఞానం అవసరం. అత్యంత సంక్లిష్టమైన ఈ టెక్నాలజీని నాడు రష్యా నుంచి సమకూర్చుకోవాలని భారత్ నిర్ణయించింది. ఈ పరిజ్ఞానాన్ని భారత్ సాధిస్తే.. ఉపగ్రహ ప్రయోగ రంగంలో భారత్ తనకు పోటీ అవుతుందని, తన వాణిజ్య ప్రయోజనాలు



దెబ్బతింటాయని భావించిన అగ్రరాజ్యం వెంటనే తన దుర్బుద్ధి బయటపెట్టుకుంది. క్రయోజెనిక్ టెక్నాలజీని క్షిపణులకూ వాడే అవకాశం ఉందంటూ చిలువలు పలువలు చేసి మాట్లాడింది. ఈ పరిజ్ఞానాన్ని భారత్‌కు ఇవ్వవద్దంటూ రష్యా మీద ఒత్తిడి చేసింది. భారత్, రష్యాల అంతరిక్ష సంస్థలపై ఆంక్షలు విధించింది.

**ఇనుమడించిన తేజస్**

అమెరికా ఒత్తిడికి తలొగ్గిన రష్యా.. క్రయోజెనిక్ పరిజ్ఞానాన్ని అందించే ఒప్పందం నుంచి వైదొలిగింది. దీనికి బదులు దాదాపు అర డజను క్రయోజెనిక్ ఇంజిన్లను మాత్రమే అందించింది. ఆ తర్వాత ఈ ఇంజిన్ టెక్నాలజీలోని సంక్లిష్టతలను ఒడిసిపట్టి, సొంతంగా ఆ యంత్రాలను తయారుచేసుకోవడానికి భారత్ ఎంతో శ్రమించాల్సి వచ్చింది. ఇందుకు 20 ఏళ్లు పట్టింది. ఈ పరిజ్ఞానంపై మన దేశం పట్టు సాధించకుండా చేయడానికి అమెరికా అన్ని ప్రయత్నాలూ చేసింది. ఈ అవరోధాలన్నీ భారత్‌కు వరాలే అయ్యాయి. ఎంతో శ్రమించి, మన శాస్త్రవేత్తలు క్రయోజెనిక్ పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించారు. అలా సొంతంగా తయారుచేసుకున్న ఇంజినే ఇటీవల నైసార్ ఉపగ్రహాన్ని చౌకగా రోదసిలోకి ప్రవేశపెట్టిన జీఎస్ఎల్‌వీ రాకెట్‌లో ఉపయోగపడింది.

1998లో భారత్ అణు పరీక్షలు జరిపినప్పుడూ అమెరికా ఆగ్రహంతో ఊగిపోయింది. ఎడాపెడా ఆంక్షలు విధించింది. దీనివల్ల అనేక సాంకేతిక ప్రాజెక్టులకు అవరోధం ఏర్పడింది. ఉన్నపళంగా మన శాస్త్రవేత్తలను తమ సంస్థల నుంచి అమెరికా బయటకు పంపేసింది. దీంతో అనేక ప్రాజెక్టుల్లో తీవ్ర జాప్యం జరిగింది. భారత్ కొంతకాలం ఇబ్బందులు పడింది. తేజస్ ప్రాజెక్టు ఇందుకు ఉదాహరణ. ఆంక్షల కారణంగా ఈ స్వదేశీ యుద్ధవిమాన ప్రాజెక్టులో తీవ్ర జాప్యం జరిగింది. తొలుత ఉత్పత్తి చేసిన వేరియంట్లలో గగనతలంలోనే ఇంధనం నింపుకోవడం వంటి సౌకర్యాలు కొరవడ్డాయి. అయినా భారత శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు దీన్ని తట్టుకున్నారు. స్వదేశీ పరిష్కార మార్గాలతో సాంకేతిక అవరోధాలను అధిగమించారు. దీనివల్ల స్వదేశీ సాంకేతిక సత్తా మెరుగుపడింది. ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తిని నమ్ముకుంటే ఒరిగే ప్రయోజనాన్ని ఇవి కళ్లకు కట్టాయి. తాజాగా సుంకాల పేరుతో అమెరికా చేస్తున్న దాదాగిరీని కూడా ఇదే రీతిలో ఎదుర్కొంటే ఫలితం ఉంటుందన్నది చరిత్ర చెబుతున్న పాఠం!

## పాక్ సరిహద్దు తీవ్రవాదంపై భారత్‌కు చైనా మద్దతు

న్యూఢిల్లీ

షాంఘై సహకార సంస్థ సదస్సులో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ పలు ద్వైపాక్షిక అంశాలను చర్చించారు. ఇందులో చైనా సరిహద్దుల నుంచి భారత్‌లోకి చొరబడుతున్న పాక్ టెర్రరిస్టుల అంశాన్ని కూడా ప్రధాని మోదీ.. జిన్‌పింగ్ వద్ద ప్రస్తావించారు. అయితే దీనికి చైనా తన సంపూర్ణ మద్దతును భారత్‌కు ఇస్తున్నట్లు స్పష్టం? చేసింది. ఈ విషయాన్ని భారత విదేశాంగ సెక్రటరీ విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ' జిన్‌పింగ్ వద్ద పాక్ ఉగ్రవాద కార్యకలాపాలను కూడా మోదీ ప్రస్తావించారు. ఇందుకు చైనా సానుకూలంగా స్పందించింది. టెర్రర్ కార్యకలాపాల వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తామని జిన్‌పింగ్ అన్నారు. ఎటువంటి ఉగ్రవాద చర్యల నిర్మూలనకైనా తమ మద్దతు ఉంటుందని జిన్‌పింగ్ అన్నారు. ఇరుదేశాలకు ప్రమాదంగా మారిన ఉగ్రవాద అంశాన్ని జిన్‌పింగ్ కూడా తీవ్రంగానే పరిగణిస్తున్నారు. ఉగ్రవాద నిర్మూలనకు భారత్‌కు తమ వంతు సహకారం అందిస్తామన్నారు' అని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. టియాంజిన్ నగరంలో ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్న మోదీ.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రాంతీయ శాంతి, ఆర్థిక స్థిరత్వం, సరిహద్దు ఉద్రిక్తతల తగ్గింపు, సాంకేతిక రంగాల్లో సహకారం పెంచుకునే వంటి అంశాలపై చర్చలు జరిగాయి.వాణిజ్య, టెక్నాలజీ, రక్షణ రంగాల్లో ఒప్పందాలు చేసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

భారత్-చైనా మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, శ్రేయస్సుపై సానుకూల ప్రభావం చూపుతాయి అని ప్రధాని మోదీ తెలపడంతో ఇరు దేశాల సంబంధాలు బలోపేతం కావడానికి అడుగులు పడ్డాయి. ఈ పర్యటన ద్వారా భారత్ తన ప్రాంతీయ ప్రాబల్యాన్ని చాటింది. ఇది భారత్-చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికే అవకాశం ఉంది.

## 'ప్రొఫైల్ ' నకిలీ.. 'సైబర్' మకిలి

నకిలీ ప్రొఫైల్, సైబర్ వేధింపులు, ప్రొఫైల్ హ్యాకింగ్.. తీరు ఏదైనా సైబర్ నేరాల సంఖ్య భారత్‌లో ఏటా పెరుగుతూనే ఉంది. జనం డిజిటల్‌కు పెద్ద ఎత్తున మళ్లుతుండడం, అదే సమయంలో పూర్తిగా అవగాహన ఉండకపోవడం.. సైబర్ నేరగాళ్లకు కలిసి వస్తున్నాయి. ముఖ్యంగా ఆన్ లైన్ , సామాజిక మాధ్యమాల వేదికగా నకిలీ ఆన్ లైన్ ఖాతాలు తెరిచి చేస్తున్న మోసాలే ఎక్కువగా ఉంటున్నాయి.

ఇతర వ్యక్తులు, బ్రాండ్, సంస్థలా కనిపించడానికి నకిలీ ఆన్ లైన్ ఖాతా తెరిచి చేస్తున్న మోసాలు దేశంలో అధికంగా ఉంటున్నాయి. అక్రమంగా డబ్బు సంపాదించే లక్ష్యంతో వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వివరాలను ఉపయోగించి సైబర్ నేరస్తులు ఇతరులను మోసం చేస్తున్నారు. గతేడాది ఇలాంటి ఘటనలు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఛి%ఎ%ఛటఛిటజీర్ఛు.జౌ౨.జీ%అ%) ద్వారా 39,846 నమోదయ్యాయి. నాలుగేళ్లలో ఈ తరహా మోసాలు మూడు రెట్లు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్ సీఆర్పీ వేదిక ద్వారా సైబర్ వేధింపుల ఫిర్యాదులు మూడున్నర రెట్లు పెరిగి 39,077కు చేరాయి. ప్రొఫైల్ హ్యాకింగ్, గుర్తింపు చోరీ ఘటనలు మూడింతలకుపైగా అధికమై 38,295కు పెరిగాయి. ఆన్ లైన్ జాబ్, మ్యాట్రిమోనియల్ మోసాలు కూడా పెరుగుతూ ఉన్నాయి.

**కేసులు ఎన్నోరెట్లు..**

అధికారిక లెక్కల ప్రకారం గతేడాది దేశవ్యాప్తంగా 22 లక్షలకుపైగా సైబర్ సెక్యూరిటీ ఘటనలు నమోదు కావడం ఆందోళన కలిగించే అంశం. ఆన్ లైన్ , సామాజిక మాధ్యమాల ద్వారా మోసాలు 2020తో పోలిస్తే 2024 నాటికి దాదాపు మూడింతలయ్యాయి. మహిళలు, పిల్లలపై జరుగుతున్న సైబర్ నేరాల సంఖ్య రెండింతలకుపైగా పెరిగి గత ఏడాది 48,475కు చేరాయి. సైబర్ నేరస్తులు ఇతర దేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నట్టు వారు ఉపయోగించిన ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్‌లను బట్టి తెలుస్తోంది. సైబర్ క్రిమినల్స్ చాలా సందర్భాల్లో తప్పుడు లొకేషన్ , గుర్తింపుతో తప్పుదోవ పట్టిస్తున్నట్టు హోం మంత్రిత్వ శాఖ వర్గాలు గుర్తించాయి.

**కేటాయింపులు మూడింతలు..**

పౌరులు, వ్యాపారాలు, ప్రభుత్వానికి సురక్షిత సైబర్‌స్పేస్‌ను నిర్మించడానికి నేషనల్ సైబర్ సెక్యూరిటీ పాలసీ (ఎన్ సీఎస్‌పీ)ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే దేశంలోని సైబర్‌స్పేస్‌ను జల్లెడ పట్టేందుకు, సైబర్ భద్రతా ముప్పులను గుర్తించడానికి నేషనల్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్ సీసీసీ) ఏర్పాటు చేసింది. డేటా సంరక్షణ కోసం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం%-%2023 తీసుకొచ్చింది. ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వ శాఖ సైబర్ సెక్యూరిటీ మౌలిక వసతుల కోసం కేటాయించిన నిధులు 5 ఏళ్లలో మూడింతలకుపైగా పెరగడం గమనార్హం.

## 'వీధికుక్కల కేసుతో నేనిప్పుడు వరల్డ్ ఫేమస్'

తిరువనంతపురం: దేశ వ్యాప్తంగా చర్చాంశనీయమైన సుప్రీంకోర్టులో వీధి కుక్కల కేసు తనని వరల్డ్ ఫేమస్ చేసిందంటూ జస్టిస్ విక్రమ్ నాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు ప్రపంచవ్యాప్తంగా పౌర సమాజం తనకు శుభాకాంక్షలు చెప్పడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని అన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (ఎన్ఎస్ఎల్ఏ) నిర్వహించిన సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న చిన్న పనులు కారణంగా నేను న్యాయవాద వర్గాల్లో ప్రసిద్ధి చెందాను. కానీ వీధికక్కల కేసు కారణంగా ఈ దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మొత్తం పౌర సమాజంలో నాకు గుర్తింపు ఇచ్చినందుకు వీధి కుక్కలకు కూడా నేను కృతజ్ఞుడను. ఈ కేసును నాకు అప్పగించినందుకు మా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి నా కృతజ్ఞతలు. సుప్రీం తీర్పును సవరించడంతో జంతు ప్రేమికులతో పాటు శునకాల నుంచి కూడా తనకు శుభాకాంక్షలు, ఆశీస్సులు అందుతున్నట్లు సందేశాలు వచ్చాయన్నారు. వీధి కుక్కల దాడులు, రేబిస్ బారినపడి పలువురు మరణించిన ఘటనలపై మీడియాలో వచ్చిన కథనాలను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ క్రమంలో.. ఢిల్లీ ఎన్సీఆర్ లో వీధి కుక్కలన్నింటినీ డాగ్ షెల్టర్స్ కి తరలించాలని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఆగస్టు 11న తీర్పు ఇచ్చింది. ఇందుకు ఆరు నుంచి ఎనిమిది వారాల గడువును ఢిల్లీ ప్రభుత్వానికి విధించిన సుప్రీం కోర్టు.. అవి మళ్లీ జనావాసాల్లోకి వస్తే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించింది. అదే సమయంలో శునకాల తరలింపును గనుక అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవంటూ జంతు ప్రేమికులను హెచ్చరించిది కూడా. ఈ నేపథ్యంలో ఈ తీర్పు సమంజసం కాదంటూ జంతు ప్రేమికులు ఆందోళనకు దిగారు. కొందరు(వీళ్లలో రాజకీయ ఇతర రంగాల ప్రముఖులు) సోషల్ మీడియాలో అభ్యంతరాలు వ్యక్తం చేయగా.. మరికొందరు నేరుగా కోర్టును ఆశ్రయించారు. దీనితో ఆదేశాలను పునఃపరిశీలిస్తానని హామీ ఇచ్చిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్.. ఈ పిటిషన్‌ను ముగ్గురు జడ్జిలతో కూడిన విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దీన్ని విచారించింది.రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశించింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించింది.

# విలక్షణ రాజకీయం

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రికి ఉన్నంత అధికారాన్ని ఆయనకు కట్టబెట్టారు. దీంతో 1989లో టీడీపీ ఓడిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈయనే టార్గెట్ అయ్యారు. ఎన్ని రకాలుగా వేధించాలో.. ఎన్ని విధాలుగా మానసిక క్షోభ కలిగించాలో అన్నీ చేశారు. 1994లో టీడీపీ అప్రతిహత విజయంతో మళ్లీ అధికారంలోకి వచ్చాక.. 1995 సెప్టెంబరు వరకు ఆయన కల్లోల దశనే ఎదుర్కొన్నారు. పేరుకు మంత్రిగా ఉన్నప్పటికీ లక్ష్మీపార్వతి ప్రభావం పడింది. అప్పుడే సరికొత్త రాజకీయ సంక్షోభం నుంచి ఆయన వినూత్న నాయకుడిగా రూపాంతరం చెందారు. అదే.. 1995 సెప్టెంబరు 1న ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం..!

ఎవరైనా ముఖ్యమంత్రి అయితే మహా ఆనందపడిపోతారు. ఆయన మాత్రం తీవ్ర విమర్శలు ఎదుర్కోవలసి వచ్చింది. ఎన్టీఆర్ నుంచి అధికారం లాగేసుకున్నారన్న అపఖ్యాతి చుట్టుముట్టింది. కానీ 1999 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు జైకొట్టడంతో విమర్శకుల నోళ్లు మూతపడ్డాయి.

**ఊహకు అందని ఆలోచనలు..**

1995లో ముఖ్యమంత్రి అయిన తర్వాత టెక్నాలజీ వైపు చూసిన చంద్రబాబు 1999 తర్వాత దానిని కొత్త పుంతలు తొక్కించారు. ప్రపంచస్థాయి నేతలతో పరిచయాలు పెంచుకోవడం, ఆ పరిచయాలను రాష్ట్రం కోసం ఉపయోగించడం ద్వారా.... ఎవరు అవునన్నా...కాదన్నా చంద్రబాబు ఈ విషయంలో గ్రేట్ అని చంద్రబాబు బద్ధ విరోధులు సైతం ప్రశంసించేలా చేసుకోగలిగారు. అందరూ ఒక దిశలో ఆలోచిస్తే.. ఆయన అందుకు భిన్నకోణంలో ఆలోచించి.. ఊహకు అందనంత దూరంలో ప్రణాళికలు రూపొందించేవారు. అందులో కొన్ని ప్రజలకు సరైన రీతిలో దక్కకపోవడంతో 2004లో ఓటమి పాలయ్యారు. వరుసగా పదేళ్లు అధికారం కోల్పోయినా.. ఎక్కడా నిరుత్సాహపడకుండా 2014లో నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రి అయ్యారు. రాజధాని గానీ, చెప్పుకోదగ్గ పరిశ్రమలు గానీ ఏవీ లేని విభజిత రాష్ట్రాన్ని నిలబెట్టే క్రమంలో ఆయన చేసిన ప్రయోగాలు ప్రజలకు రుచించలేదు. దాంతో మళ్లీ ఓటమి పాలయ్యారు.

**ఆ ఐదేళ్లూ వేధింపులు.. కక్షసాధింపులు**

2019లో అధికారంలోకి వచ్చింది జగన్ కావడంతో వేధింపులు, సాధింపుల స్థానంలో కక్ష సాధింపులు మొదలయ్యాయి. చంద్రబాబు చుట్టూ మనుషులు లేకుండా చేయాలన్న జగన్ ప్రయత్నం కొంత వరకు ఫలించింది. అధికారంలో ఉన్నప్పుడు వీరుడు, శూరుడు, విక్రమార్కులు అన్నవారు సైతం ఇంట్లో పెళ్లికి కార్డు ఇవ్వడానికి కూడా చంద్రబాబు వద్దకు వెళ్లలేదు. ఎంత కిందకు పడితే అంత పైకి లేస్తారనే పేరున్న చంద్రబాబును మరింత కఠినంగా తొక్కేయడం కోసం జగన్ తన ఒరిజినల్ రూపాన్ని బయటపెట్టుకున్నారు. 70 ఏళ్లు పైబడిన వ్యక్తి అని చూడకుండా అమానుష పద్ధతిలో తప్పుడు కేసులో అరెస్టు చేశారు. 53 రోజుల పాటు జైలు జీవితం గడిపిన చంద్రబాబు.. ఒక్కసారిగా ప్రజల గుండెల్లోకి దూసుకుపోయారు. కళ్లుదిరిగే మెజారిటీతో 2024లో ఘన విజయం సాధించారు. ఒక వ్యక్తి అధికారం కోల్పోవడం, మళ్లీ తిరిగి రావడం సాధారణం.. కానీ ఇన్ని సార్లు అధికారం పోయినా మళ్లీ మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో విజయతీరాలకు చేరుకోవడం అసాధారణ విషయం. ఇది చంద్రబాబుకే చెల్లింది.

**ఎక్కడున్నా కింగ్ మేకర్....**

చంద్రబాబు ఎక్కడున్నా కింగ్‌మేకరే. అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఎన్డీయే కన్వీనర్‌గా వ్యవహరించిన ఆయన.. ప్రఖ్యాత క్షిపణి శాస్త్రవేత్త అయిన ఏపీజే అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా ఎంపిక చేయడంలో కీలక భూమిక పోషించారు. అదే విధంగా ప్రముఖ జన్యు శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌ను, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి లాంటి వారిని సలహాదారులుగా నియమించుకోవడం ద్వారా.. శాస్త్ర సాంకేతిక రంగాల పరిజ్ఞానాన్ని రాష్ట్రప్రభుత్వం వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రపంచ స్థాయి కార్పొరేట్ దిగ్గజాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించి రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఏపీకి రావడం చంద్రబాబు వల్లే సాధ్యమైంది. కర్షక పరిషత్ చైర్మన్‌గా ఉన్నప్పుడు.. క్షీర విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్‌ను పిలిపించి పాడి ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత కూడా ఆయనదే.

పడిపడి లేచిన బాబు..

పడి.. లేవడం చంద్రబాబు నైజం. నాలుగు సార్లు సీఎంగా పనిచేసిన ఆయన.. ప్రతిపక్ష నేతగానూ సుదీర్ఘకాలం పనిచేశారు. 2004, 09ల్లో వరుస పరాజయాలతో పదేళ్లు ప్రతిపక్షంలోనే కూర్చున్నారు. 2014లో కొత్త రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు అనుభవజ్ఞుడు కావాలని జనం ఆశించి ఆయనకే పట్టం కట్టారు. మళ్లీ 2019లో ఓడిపోయి ఐదేళ్లూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. అయితే ఈ ఐదేళ్లలో ఆయన రాజకీయ నాయకత్వానికే సవాల్ ఎదురయ్యే అనుభవాలు ఎదురయ్యాయి. ప్రజల్లోకి వెళ్లకుండా నాటి సీఎం జగన్ ఆయన్ను కట్టడి చేశారు. ఇంట్లో నుంచి బయటకే రానివ్వలేదు. ఆయన సహచరులను తప్పుడు కేసుల్లో ఇరికించి జైళ్లకు పంపారు. చివరకు చంద్రబాబును సైతం అక్రమ కేసులో ఇరికించి.. అక్రమంగా అరెస్టు చేసి జైలు పాల్జేశారు. అదే జగన్‌కు అశనిపాతమైంది. 30 ఏళ్లు రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంతో ఏలతానని కలలుగన్న జగన్‌కు జనం కర్రుగాల్చి వాతపెట్టారు. కనీసం ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేశారు. చంద్రబాబును మళ్లీ సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు. ఇలా ఎన్ని సార్లు ఆయన కింద పడినా.. మళ్లీ జనం అండతో పైకి లేస్తూనే ఉన్నారు.

**పది నిమిషాలిస్తే..**

ఒక చిన్న అవకాశం దొరకాలే గాని.. దానినెలా సద్వినియోగం చేసుకోవాలో చంద్రబాబుకు తెలిసినంత మరెవరికీ తెలియదేమో? అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌ను హైదరాబాద్‌కు రప్పించడమే అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. దటీజ్ చంద్రబాబు అని దేశమంతా ప్రశంసించింది. ఆ సమయంలోనే మరో విశేషం చోటుచేసుకుంది. అంతటి క్లింటన్ వచ్చినప్పుడు అలా వచ్చి ఇలా వెళ్లిపోతే మనకేముంటుంది.. మనమేంటో, మనకేం కావాలో చెప్పుకోవాలని చంద్రబాబుకు అనిపించింది. ఎవరెవరినో పట్టుకున్నారు.. క్లింటన్‌తో పది అంటే పదే నిమిషాలు విడిగా మాట్లాడేందుకు అనుమతి పొందారు. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు ఎంత సమయమిస్తే ఆ సమయానికి కార్యక్రమం ముగిసిపోవాలి. కానీ చంద్రబాబుతో పది నిమిషాల కోసం కూర్చుంటే వారి చర్చలు ఏకంగా 40 నిమిషాలు కొనసాగాయి. అమెరికా నుంచి వచ్చిన క్లింటన్ భద్రతా సిబ్బంది కూడా ఆశ్చర్యపోయారు. మహా అయితే ఐదు నిమిషాలు ఎక్కువ కొనసాగవచ్చు.. అరగంట ఎక్కువ సేపు మాట్లాడడం వారినే కాదు, అమెరికా పారిశ్రామికవేత్తలనూ విస్మయపరిచింది.

## ఉధృతంగానే గోదావరి

-మొదటిపేజీ తరువాయి

మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.470 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక, ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నాయి. రాజమహేంద్రవరం అఖండ గోదావరి వద్ద లంక, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 12.80 అడుగులుగా ఉంది. ఈ నీటిమట్టం 13.75 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వరద నిలకడగా ఉండడంతో ఆ పరిస్థితి రాకపోవచ్చునని పేర్కొన్నారు. మరోవైపు ధవళేశ్వరం నుంచి 11 లక్షల 35 వేల 249 క్యూసెక్కుల మేరకు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువ భాగంలోని ఏటూరు నాగారం వద్ద వరద తగ్గుముఖం పట్టగా, కూనవరం, ధవళేశ్వరం వద్ద పెరుగుతున్నట్టు అధికారులు తెలిపారు.

## బీచ్‌శాండ్‌పై కదలిక

-మొదటిపేజీ తరువాయి

మైనింగ్ లీజులు చేపట్టేందుకు అవసరమైన డెవలపర్ ఎంపిక కోసం టెండర్లు పిలిచారు. ఇప్పుడు ఆ టెండర్లకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులు తొలగిపోయాయి. టెండర్లు ఖరారు చేసుకోవచ్చని హైకోర్టు ఇటీవల అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో గతంలో నిర్వహించిన టెండర్లలో కంపెనీలు దాఖలు చేసిన ఆర్థిక, సాంకేతిక బిడ్లను అధికారులు పరిశీలించారు. బిడ్డింగ్‌లో అర్హత సాధించిన కంపెనీల వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిసింది. ఇందులో అదానీ గ్రూప్‌నకు చెందిన రెండు కొత్త కంపెనీలు బిడ్‌లు దాఖలు చేసిన విషయాన్ని గతంలోనే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. శ్రీకాకుళం జిల్లా గార, విశాఖ జిల్లా భీమిలిలో మైనింగ్‌కు జరిగిన టెండర్లలో అదానీ గ్రూప్ కంపెనీలే ముందువరసలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైకోర్టు సూచనల మేర కు ప్రాజెక్టు డెవలపర్ విధులు, ఏపీఎండీసీ బాధ్యతల విషయంలో కొన్ని నియమ నిబంధనలు మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు గనుల శాఖ నివేదిక సమర్పించినట్లు తెలిసింది. గతంలో వచ్చిన న్యాయపరమైన చిక్కులు జూలై 31తో తొలగిపోయాయని, ఇక టెండర్ల ఖరారు ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉందని ఆ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. తొలిదశలో శ్రీకాకుళం జిల్లా గారలో 909.85 హెక్టార్లు, విశాఖ జిల్లా భీమిలిలో 90.15 హెక్టార్లలో విడివిడిగా డెవలపర్ కోసం టెండర్లు పిలిచినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఏపీలో ఇంకా 16 వేల హెక్టార్ల పరిధిలో బీచ్‌శాండ్ మినరల్స్ నిక్షేపాలున్నాయని, ఈ మేరకు ఏపీఎండీసీకి లీజులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు ఆ నివేదికలో తెలిపారు. అయితే కేంద్రం కేవలం వెయ్యి హెక్టార్లకే లీజులు ఇచ్చిందని నివేదించారు. ఈ అంశాలపై గతంలో అణుశక్తి విభాగం లేవనెత్తిన అంశాలు, ఏపీఎండీసీ ఇచ్చిన వివరణలు, ఇతర సాంకేతిక అంశాలను కూడా ప్రస్తావించినట్లు తెలిసింది. అయితే కోర్టు చిక్కులు తొలగినందున తొలుత వెయ్యి హెక్టార్ల పరిధిలో టెండర్లు ఖరారు చేయాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. 16,004 హెక్టార్ల పరిధిలోని 16 లీజులను కూడా ఏపీఎండీసీకి కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మరోసారి కేంద్రానికి లేఖ రాసింది. బీచ్‌శాండ్ మైనింగ్, ఇందులోని ఖనిజాలైన ఇలిమినైట్, రుటైల్, గార్నెట్, సిలిమినైట్, జిర్కాన్, మోనోజైట్‌లను ప్రాసెస్ చేసే ప్లాంట్ల ఏర్పాటు కోసం కనీసం 2 వేల కోట్ల పెట్టుబడులు ఉంటాయని గనుల శాఖ చెబుతోంది.

### 7న కృష్ణాజిల్లా సీనియర్

## సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు

విజయవాడ, మహానగర్

కృష్ణాజిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7వ తేదీన జిల్లా సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య నగర పాలక సంస్థ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్ లో 7వ తేదీ ఉదయం 7గంటలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన జట్లు సెప్టెంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ లో పాల్గొంటాయని తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులు తప్పవా...

విజయవాడ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించాల్సిన నిధులు ఇప్పటికే తెచ్చేసుకున్నారు. తొలి ఏడాదిలోనే అవసరమైన నిధులకు సమీకరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించింది. అయితే రానున్న కాలంలో చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లినా అనుకున్న స్థాయిలో నిధులు వచ్చే అవకాశాలు లేవన్నది ఉన్నతాధికారుల నుంచి అందుతున్న సమాచారం. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వం ఫోకస్ అంతా బీహార్ పైనే ఉంది. బీహార్ లోనూ, వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడుపైన ఎక్కువ దృష్టి పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కు ఇప్పట్లో ఎన్నికలు లేకపోవడంతో పాటు ఇప్పటికే చంద్రబాబు అడిగినంత మేరకు ఆర్థిక సాయం చేయడమే కాకుండా అవసరమైన రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఇప్పుడు బీజేపీకి చంద్రబాబు ప్రయారిటీ కాదన్నది రాజకీయంగా వాస్తవం. చంద్రబాబు నాయుడు కూటమిలోనే ఉన్నందున ఆయన వల్ల రాజకీయంగా ఇబ్బందులు తలెత్తవని కూడా బీజేపీ నేతలు భావిస్తున్నారు. అందుకే విశాఖ స్టీల్ ప్లాంట్ లోని 34 విభాగాల్లో ప్రయివేటీకరణకు సిద్ధమయిందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల విడుదలలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇక పెద్దగా ఆసక్తి చూపదని చెబుతున్నారు. ఇప్పటికే చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం సహకారం ఉంటుందని భావించి సంక్షేమ పథకాలను గ్రౌండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్లు అప్పులు చేశారు. ఎఫ్ఆర్ఎంబీ పరిమితికి మించి అప్పులు చేశారన్న ఆరోపణలు కూడా విపక్ష వైసీపీ నేతలు చేస్తున్నారు. అదే సమయంలో ఇక ప్రతి నెలా సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఆంధ్రప్రదేశ్ లో ఆదాయం కంటే హామీలకు అవసరమైన నిధుల అవసరం ఎక్కువ కావడంతో ఇక రానున్న కాలంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు తప్పవన్న కామెంట్స్ అధికారిక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇటీవల ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో చంద్రబాబు సమావేశమయినప్పటికీ ఆశించిన స్పందన లేదని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడుకు రానున్న కాలం ఖజానాను నింపడం, వెల్ఫేర్ స్కీమ్స్ ను కొనసాగించడం కత్తిమీద సాము వంటిదేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## విశాఖలో గూగుల్ డేటా సెంటర్

విశాఖపట్టణం

ప్రముఖ దిగ్గజ సంస్థ గూగుల్ ఇప్పుడు వైజాగ్‌లోనూ అడుగుపెట్టనుంది. సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. అంతేనా.. ఆసియా ఖండంలోనే ఇది అతిపెద్ద హైపర్‌స్కేల్ డేటా సెంటర్ కానుంది. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల ఏర్పాటు చేసే అతిపెద్ద కేంద్రానికి సైతం విశాఖ వేదిక కానుంది. ఈ మేరకు గూగుల్‌కు చెందిన ఇన్వెస్ట్ ఇండియా ఎక్స్‌లో వెల్లడించింది. గూగుల్ ప్రతిపాదన గేమ్ ఛేంజర్ కానుంది. ప్రపంచానికి డిజిటల్ హబ్‌గా దేశానికి గుర్తింపు వస్తుందని జాతీయ పెట్టుబడుల ప్రోత్సాహక, సమన్వయ సంస్థ ఇన్వెస్ట్ ఇండియా తన ప్రకటనలో పేర్కొంది. ఇన్వెస్ట్ ఇండియా ప్రకటనలో ఇప్పుడు యావత్ ప్రపంచం ఫోకస్ ఏపీపై నిలిచింది. గూగుల్ క్లౌడ్, సెర్చ్, యూట్యూబ్, ఏఐ వర్క్‌ల పర్యావరణ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ఈ డేటా సెంటర్ ఉపయోగపడనుంది. అంతేకాకుండా పరిశ్రమలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురానుంది.విశాఖలో త్వరలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్.. దేశానికి చెందిన మొత్తం డేటా నిల్వ చేయనుంది. దీనివల్ల ఉగ్రమూక చేతిలోకి విలువైన డేటా చేరే అవకాశం తప్పుతుంది. అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్‌ను పెంచేందుకు 3 సబ్ మెరైన్ కేబుల్స్‌కు సరిపడా ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి డేటా సెంటర్‌ను అనుసంధానిస్తుంది. ముంబయిలో గూగుల్‌కు చెందిన పియరింగ్, క్యాచీ సర్వర్లు ఉన్నాయి. అక్కడి నుంచి సముద్ర మార్గంలో కేబుల్ తీసుకోవడం సులువు అవుతుంది. డార్క్ ఫైబర్ ద్వారా తక్కువ ఖర్చుతో తీసుకోవాలని ప్రణాళికలు వేస్తున్నారు. డేటా సెంటర్ కూలింగ్ కోసం పెద్దఎత్తున నీరు అవసరం అవుతుంది. అందుకే డేటా సెంటర్ ఏర్పాటు కోసం గూగుల్ విశాఖ సముద్ర తీరాన్ని ఎంపిక చేసుకుంది.పైగా ఐటీ రంగంలో రూ.2 కోట్ల పెట్టుబడి పెడితే ఒకరికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఆ లెక్కన గూగుల్ సంస్థ పెట్టే సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడుల ఆధారంగా రాష్ట్రంలోని సుమారు 25 వేల మంది నిరుద్యోగులకు దశలవారీగా ప్రత్యక్ష ఉపాధి అవకాశం లభించనుంది. ఇక పరోక్షంగా మరో 50 వేల మందికి ఉపాధి లభించనుంది. అంతేకాకుండా డేటా సెంటర్ కోసం పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించాలని గూగుల్ నిర్ణయించింది. ఆ విద్యుత్ ప్రాజెక్టుల కోసం సుమారు రూ.20 వేల కోట్లు గూగుల్ ఖర్చు చేయనుంది. సముద్ర తీరం వెంట చిన్న హైడ్రో ప్రాజెక్టులు ఏర్పాటు చేసి, వాటి ద్వారా వచ్చే విద్యుత్‌ను గూగుల్ వినియోగించుకోనుంది.

### చెన్నై, హైదరాబాద్.., బెంగళూరు ఇక 2 అవర్స్...

## అమరావతి నుంచి కొత్త లైన్లు

విజయవాడ

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైళ్లు పరుగులు తీయనున్నాయి. హైదరాబాద్– చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ రైలు కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎలైన్‌మెంట్‌కు ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ కారిడార్ అమరావతిని చేరుకుంటూ, సీఆర్డీయే మీదుగా వెళ్తుంది. ఇదే విధంగా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళ్లే హైదరాబాద్– బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్‌కూ ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ రెండు రైలు మార్గాల నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల్లో ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.మెట్రో నగరాల మధ్య బుల్లెట్ రైళ్లు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తున్నది. ఈ ప్రాజెక్టులో భాగంగా, హైదరాబాద్–చెన్నై హైస్పీడ్ కారిడార్, హైదరాబాద్– బెంగళూరు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్తాయి. ఈ రెండు కారిడార్లు ప్రారంభంలో హైదరాబాద్ నుంచి శంషాబాద్ వరకు 38.5 కిలోమీటర్ల వరకూ ఒకే మార్గంలో వెళ్తాయి. అనంతరం, చెన్నై, బెంగళూరు వైపుగా విడిపోయే వేర్వేరు మార్గాలుగా సాగుతాయి.హైదరాబాద్– చెన్నై హైస్పీడ్ కారిడార్ కోసం 839.5 కి.మీ, 749.5 కి.మీ, 744.57 కి.మీలతో 3 ప్రతిపాదిత మార్గాలను పరిశీలించారు. వీటిలో అతి తక్కువ దూరమైన 744.5 కి.మీ. మార్గాన్ని ఎలైన్‌మెంట్‌కు ప్రాథమికంగా ఖరారు చేశారు. ఈ కారిడార్‌లో తెలంగాణలో 6, ఆంధ్రప్రదేశ్‌లో 8, తమిళనాడులో 1 స్టేషన్ నిర్మించనున్నారు. ఏపీలో ప్రతిపాదిత స్టేషన్లు అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, నాయుడుపేట, తడ ఉన్నాయి.

## సుంకాలపై 'సమష్టి' పోరు




అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. మన దేశంపై ఉన్న అదనపు సుంకాల భారాన్ని 50 శాతానికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఉన్న 25 శాతం సుంకాలకూ బుధ వారం నుంచి మరో 25 శాతం చేరింది. క్షణానికో రకంగా, రోజుకో విధంగా ప్రవర్తిస్తూ ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవటంలో సిద్ధహస్తుడైన ట్రంప్ చివరికి ఏం చేస్తారోనన్న ఉత్కంఠ అందరిలో ఉండేది. మూర?త్వం విచక్షణను ఎరుగదు. తన ఆదేశాలను ధిక్క రిస్తూ రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయటం వల్లే ఈ చర్య తీసుకున్నట్టు అమెరికా చెప్పుకొంటోంది. మనల్ని మించి ముడిచమురు కొంటున్న చైనాకు ఆ తర్కం ఎందుకు వర్తించదో ఇంతవరకూ అది సంజాయిషీ ఇవ్వలేకపోయింది. అసలు రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపే శక్తి అమెరికాకు తప్ప మరెవరికీ లేదు. ఎందుకంటే తెరవెనకుండి యూరప్ దేశాల ద్వారా ఉక్రెయిన్‌ను రష్యాపై ఉసిగొల్పిందీ, ఆ యుద్ధానికి అంకు రార్పణ చేసిందీ తానే. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించటం ద్వారా... లేక ఇక వెనక్కు తగ్గాలని ఉక్రెయిన్‌ను కోరటం ద్వారా శాంతికి దోహదపడాల్సింది కూడా తానే. కానీ ఆ పని చేయకపోగా ఆ యుద్ధం కొనసాగటానికి మనమే బాధ్యులమంటూ దబాయిస్తోంది. దాన్ని 'మోదీ యుద్ధం'గా అభివర్ణిస్తూ వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవరో నోరు పారేసుకున్నారు. మనం చమురు కొనటం వల్లే రష్యా యుద్ధం కొనసాగుతోందని తప్పుడు భాష్యానికి దిగారు. ఏ రకంగా చూసినా ప్రపంచంలో సకల అవలక్షణాలకూ బాధ్యత వహించక తప్పని అమెరికాయే రష్యా– ఉక్రెయిన్ యుద్ధానికి కూడా కర్త, కర్మ, క్రియ. ఏకకాలంలో భిన్న సూచనల్ని పంపి అవతలి పక్షాన్ని గందరగోళపరచటం అమెరికాకు అలవాటైన విద్య.

ఈ దబాయింపులకు ముందురోజే ఆర్థిక మంత్రి స్కాట్ బిసెంట్ 'చివరకు రెండు దేశాలూ ఒక్కటవుతాయి' అని మాట్లాడారు. అందరికన్నా ముందు ఏప్రిల్‌లోనే వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు మొదలెట్టిన భారత్... మే 1 లేదా జూన్ 1 కల్లా దానిపై సంతకాలు చేయాల్సిందని ఆయన చెబుతున్నారు. చర్చించు కుని ఒప్పందంపై సంతకాలు చేస్తారు తప్ప, తమకు నచ్చినట్టు రాసుకుని, ఒప్పందం పూర్తయినట్టేనని చెబితే అంగీకరించేదెవరు? ఇలాంటివి మాఫియా సామ్రాజ్యాల్లో చెల్లుబాటవుతాయి. నాగరిక ప్రపంచంలో సాధ్యపడదు. భారత్–అమెరికా సంబంధాలు ఆదినుంచీ సంక్లిష్టమైనవే. ఇందుకు అమెరికా తనను తానే నిందించుకోవాలి. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో పాకిస్తాన్‌కు సాయపడుతూ, మనల్ని చీకాకు పరిచేందుకు నిరంతరం ప్రయత్నించేది. ఆ దశ దాటి ఇరు దేశాల మధ్యా స్నేహం చిగురించి, దృఢమైన బంధంగా మారి దశాబ్దాలు దాటుతోంది. కానీ పాకిస్తాన్‌ను దువ్వటం ఆపలేదు. ఉగ్రవాద ఘటనలు జరిగినప్పుడల్లా మన దేశం డిమాండ్ చేస్తే తాత్కాలికంగా ఆర్థిక సాయం ఆపటం లేదా ఆయుధ సామగ్రి ఎగుమతి నిలిపినట్టు కనబడటం, ఆ తర్వాత పునరుద్ధరించటం అమెరికా దురలవాటు. మొన్నటికి మొన్న పెహల్గాంలో ఉగ్రవాదుల దుశ్చర్యపై ఒక్క మాట మాట్లాడటానికి నోరు పెగలని ట్రంప్, భారత్–పాక్ ఘర్షణల్ని ఆపానని స్వోత్కర్షకు పోవటం ఇప్పటికీ ఆపలేదు. సరిగదా పాక్ ఆర్మీ చీఫ్‌కు ఘన ంగా మర్యాదలు చేశారు. కెనడాలో జరిగిన జీ–7 శిఖరాగ్ర సదస్సు నుంచి రావాలన్న ఆహ్వానాన్ని మోదీ తిరస్కరించటం, తమ డెయిరీ ఉత్పత్తులనూ, జన్యుమార్పిడి ఆహార ఉత్పత్తులనూ అనుమతించాలన్న ఒత్తిడికి అంగీకరించకపోవటం ట్రంప్ కడుపుమంటకు కారణం. కానీ ముడిచమురు సాకు చెబుతున్నారు. భారత్‌లో 46 శాతం మంది సాగు రంగంపై ఆధారపడతారు. అమెరికాలో ఇది ఒక్క శాతమే. ఆ ఒక్కశాతం కోసం దేశ జనాభాలో సగంమంది ఆధారపడే రంగాన్ని ధ్వంసం చేయాలట! ఏమైతేనేం తాజా సుంకాల భారం మన దేశంనుంచి పోయే 66 శాతం ఎగుమతులపై తీవ్ర ప్రభావమే చూపగలదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందువల్ల ఈ ఏడాది, వచ్చే ఏడాది మన వృద్ధిపై 0.8 శాతం కోత పడవచ్చంటున్నారు. రత్నాభర ణాలు, దుస్తులు, వాహనాల విడిభాగాలు, స్టీల్, రొయ్యలు, తోలు ఉత్పత్తులు వగైరాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందనీ, ఈ రంగాల్లో అనిశ్చితి ఏర్పడుతుందనీ అంచనా. లక్షలాదిమంది కార్మికుల ఉద్యోగాలకు ముప్పు కలగవచ్చు కూడా. ఈ ఎగుమతుల్ని వేరే దేశాలకు మళ్లించగలిగితే నష్టాన్ని తగ్గించుకోగలం. అదృష్టవశాత్తూ మనది ఎగుమతుల ఆధారిత ఆర్థిక వ్యవస్థ కాదు. అందుకే దేశ ప్రజానీకమంతా ఒక్కటై పట్టుదలగా ఇక్కడి ఉత్పత్తుల్ని ప్రోత్సహిస్తే ఈ గండాన్ని గట్టెక్కడం కష్టం కాదు.

మా కలం - సామాన్యుడి బలం RNI No : APTEL/2020/15905
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# అంతరాలు మానేద్దాం ..అన్యోన్యంగా ఉందాం

## ఎస్సీ కులాల ఆత్మీయ సమ్మేళనంలో సామాజిక సమరసతావేదిక ప్రముఖులు



నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 31

అంతరాలు మానేద్దాంఅన్యోన్యంగా ఉందాంఅంటూ సామాజిక సమరసతా వేదిక అగ్ర నేతలు పేర్కొన్నారు.

ఆదివారం నెల్లూరులోని శ్రీ వివేకానంద పాఠశాలలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో మూడు జిల్లాల ఎస్సీ కులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.సామాజిక సమరసతావేదిక ప్రాంత కార్యకారిణి కోడూరు సత్యం అధ్యక్షత వహించిన సమావేశంలో వేదిక జాతీయ కన్వీనర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 7000 కులాలు ఉన్నాయని అదే విధంగా ఏపీలో మొత్తం 58 కులాలు ఉన్నాయన్నారు.ప్రతి కులానికి ఆచారాలు కులదేవతలు ఉన్నట్లు తెలిపారు.వీటిలో ఉప కులాలు ఎన్నో ఉన్నాయని ఎవరెవరి ఆచారాలు కాపాడుకుంటూ అందరూ సమైక్యంగా కలిసిమెలిసి ఉండాలని సూచించారు.ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకొనేమనస్తత్వంతో ముందుకు పోవాలన్నారు.ఇందుకోసం పలు ఉదాహరణలు వివరించారు.ఎస్సీ ఎస్టీ హక్కుల వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు విశ్రాంత ఐఏఎస్ అధికారి కే పరశురాంసమావేశానికి విచ్చేసిన ఉపకులాల ప్రతినిధుల అభిప్రాయాలను సందేహాలను స్వీకరించి సమాధానం అందజేశారు.రామాయణం మహేష్ స్వామి తన సందేశంలోసృష్టి ప్రారంభం నుంచి అందరం సమానమని ఎవరు ఎక్కువ తక్కువ కాదనిభారతదేశంలో అనాదిగా అందరి మధ్య సమైక్యత సాధించిన ఘనత దక్కుతుందన్నారు ఈ సందర్భంగా సామాజిక సమరసత పైఆలపించిన గేయాలు

"నువ్వు నేను అన్నదమ్ములంకలిసిమెలిసి జీవిస్తే బ్రతుకుకుఅర్థం"సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర సహసంయోజక్ రాజా రామచంద్ర తో పాటు మూడు జిల్లాలు నెల్లూరు ప్రకాశం తిరుపతి వేదిక ప్రతినిధులు ఆయా జిల్లాల ప్రధాన బాధ్యులు ఉపకులాల సభ్యులు పాల్గొన్నారు

## నేడు సోమవారం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు పాలాభిషేకం



బంగారుపాళ్యం.ఆగస్టు 31

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు మద్యం షాపులలో 10 శాతం బార్లలో 10 శాతాం హక్కు కల్పించినందుకు కల్లుగీత కార్మికులు బంగారుపాళ్యం మండల పరిధిలోని నలగాంపల్లి గ్రామం నందు చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ బిసి ఈడిగ సాధికారిక సమితి అధ్యక్షులు బుసా నాగరాజు గౌడ్,మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి జనార్ధన్ గౌడ్ ల ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కళ్ళు గీత కార్మికుల కోసం రాష్ట్రంలో మద్యం దుకాణాల్లో 10శాతం బార్లలో 10 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపి సోమవారం 1-9-2025 వ తేదిన చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని బోయకొండ వజ్రాలపురం గంగమ్మ దేవస్థానం నందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు పాలాభిషేకం చేస్తున్నట్లు వారు తెలిపారు అలాగే గౌడవాణి మాస పత్రిక 19 వార్షకోత్సవంసందర్భంగా పుస్తకం ఆవిష్కరణ మరియు చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ బిసి ఈడిగా సాధికారిక సమితి అధ్యక్షులు బుసా నాగరాజు గౌడ్ జన్మదిన వేడుకలను జరుపబడునని ఈ చంద్రబాబు పాలాభిషేకం,బుసా నాగరాజు గౌడ్ జన్మదిన కార్యక్రమానికి జిల్లాలోని ఈడిగా గౌడ్ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు

## వాకాడులో ట్రాక్టర్ ప్రమాదం: భక్తులకు గాయాలు

స్వర్ణసాగరం వాకాడు :



తిరుపతి జిల్లా వాకాడు మండలం బీసీ కాలనీ వద్ద వినాయక నిమర్జనం కోసం వెళ్తున్న భక్తులతో కూడిన ట్రాక్టర్ బోల్తా పడింది. కాశిపురం నుండి తూపిలపాళెం సముద్ర తీరం వైపు ప్రయాణిస్తున్న భక్తులు ఈ దుర్ఘటనలో గాయపడ్డారు.ట్రాక్టర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం జరిగింది. సుమారు పదిమంది భక్తులు గాయాలతో వాకాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించబడ్డారు. గాయాల తీవ్రత ఇంకా స్పష్టంగా తెలియలేదు. స్థానికులు వెంటనే సహాయం అందించారు. పోలీసులు ప్రమాద కారణాలను విచారిస్తున్నారు.

## పూతలపట్టులోఘనంగా గణేష్ నిమజ్జనం



పూతలపట్టు స్వర్ణ సాగరం ఆగస్టు 31

పూతలపట్టు మండల పరిధిలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు అందులో భాగంగా అమ్మేపల్లి గ్రామస్తులు గత ఐదు రోజులుగా పూజలు చేస్తూ ప్రసాదాలు పంచి పెడుతూ అన్నదానం కార్యక్రమంనిర్వహిస్తూ ఈరోజు ఆదివారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు స్వామివారికి ధూపదీప నైవేద్యం సమర్పించి కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం స్వామివారిని పల్లకిపై ఉంచి డబ్బులు మేళ తాళాలు డ్రమ్ములు నడుమ బాణాసంచా కాలుస్తూ ఊరేగింపుగగా నిమజ్జనం చేశారు. అదేవిధంగా పూతలపట్టు, తలపులపల్లి, ఆకనంబట్టు, పూతలపట్టు వైయస్సార్ కాలనీ తదితర గ్రామాల్లో ఘనంగా నిమజ్జనం చేపట్టారు. ఈ కార్యక్ర మంలో గ్రామ యూత్ గ్రామ పెద్దలు పిల్లలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా వృద్ధ మహిళకు గాయాలు



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగు మాడవీధుల పెళ్లి మండపం వద్ద గణనీయమైన ట్రాఫిక్ రద్దీ నెలకొని యున్నది. పెళ్లి మండపం పక్కనే మున్సిపాలిటీ నిర్మించిన కాలువలో ఒక వృద్ధ మహిళ పాదం మోపుచుండగా, ట్రాఫిక్ రద్దీ కారణంగా ఎదురుగా వస్తున్న ఆటోను గమనించిన ఆమె పాదం జారిపడింది. ఈ దుర్ఘటనలో ఆమె పాదానికి తీవ్ర గాయాలయ్యాయి. అధిక రక్తస్రావం అగుచుండటంతో, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు అధికారులు ఆమెను తక్షణమే ఏరియా ఆసుపత్రికి తరలించిరి. ఈ సంఘటన పట్టణంలోని ట్రాఫిక్ సమస్య తీవ్రతను మరోసారి వెలుగులోకి తెచ్చింది. పెళ్లి మండపం వంటి ప్రదేశాలలో ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపాలిటీ నిర్మించిన కాలువల భద్రతను కూడా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడటం అధికారుల బాధ్యత. వృద్ధ మహిళ ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీయడం కూడా అవసరం.

# ప్రజాసేవే కోటంరెడ్డికి శ్రీరామరక్ష

### శ్రీధరన్నను టచ్ చేసే దమ్ము, ధైర్యం ఎవ్వరికి లేదు

### అసెంబ్లీ సాక్షిగా జగన్ రెడ్డిని నిలదీసిన సింహపురి మొనగాడు శ్రీధర్ రెడ్డి

### 300కోట్లతో నెల్లూరు రూరల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన కృషివలుడు

### కె.ఆర్ ట్రస్ట్ అధినేత, టిడిపి యువజన నేత వేలూరు కళ్యాణ్ రెడ్డి వెల్లడి.

పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 31.



300 కోట్లు వ్యయంతో నెల్లూరు రూరల్ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తూ పేద ప్రజల ఆశాజ్యోతి గా గుర్తింపు పొందుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసినట్లు కె ఆర్ ట్రస్ట్ అధినేత, తెలుగుదేశం పార్టీ యువజన నేత వేలూరు కళ్యాణ్ రెడ్డి వెల్లడించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూనే ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ఎండగడుతూ అసెంబ్లీ సాక్షిగా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించిన ఏకైక నేత శ్రీధర్ అన్న సింహపురి మొనగాడు అంటూ ప్రశంసించారు. పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా, సమాజ అభివృద్ధి ధ్యేయంగా ప్రతిక్షణం ప్రజాసేవకే కేటాయిస్తూ ముందుకు సాగుతున్న శ్రీధర్ అన్నకు ప్రజలే శ్రీరామరక్ష అని వెల్లడించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రూరల్ నియోజకవర్గం లోనే కాకుండా పలు ప్రాంతాలకు చెందిన అనేకమంది తమ కష్టాలను విన్నవించుకున్నప్పుడు తారతమ్యా ప్రాంత భేదాలు లేకుండా అన్ని సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేస్తున్న శ్రీధర్ అన్న ఒకప్పటి ధర్మరాజుకు సాక్షాత్తు నిదర్శనం అన్నారు. న్యాయం, ధర్మం ఊపిరిగా కొనసాగే ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పై కొందరు బురదజల్లే ప్రయత్నాలు చేస్తుంటే, ఇంకొందరు పాపాలు మూటగట్టుకునే ప్రయత్నాలు చేయడం తగదని హితోపలికారు. అజాతశత్రువు లాంటి శ్రీధర్ అన్నను టచ్ చేసే దమ్ము, ధైర్యం ఎవరికైనా ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. అలాంటి చెడు ఆలోచన చేసేవారికి దేవుడే తగిన శిక్ష వేస్తాడని తెలిపారు. ప్రజల కోసం పనిచేయడం, ప్రజలకు నచ్చినట్లు నడుచుకోవడం, ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేయడం ఆయన నైజం అన్నారు. అందుకే జగన్ పార్టీకి రాజీనామా చేసి ధైర్యంగా సైకిల్ ఎక్కి మగధీరుడుగా తెలుగుదేశం పార్టీ జెండాను నెల్లూరు రూరల్ ప్రాంతంలో రెపరెపలాడించాడని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు నమ్మకమైన వ్యక్తిగా, పేదల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ని అన్ని వర్గాల ప్రజలు మనసారా ఆశీర్వదించి అండగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు స్పష్టం చేశారు.

## నారాయణాద్రి, వాసన్ ఐ ఆసుపత్రుల సంయుక్త ఉచిత మెగా వైద్య శిబిరం



రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 31

రేణిగుంట పంచాయతీలోని ఓల్డ్ చెక్ పోస్ట్ సమీపంలోని ఇన్ఫంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం ఆర్ సి ఎం చర్చ్ ఆధ్వర్యంలో నారాయణాద్రి హాస్పిటల్, వాసన్ కంటి ఆసుపత్రి సంయుక్త సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. నారాయణాద్రి నుంచి వచ్చిన వైద్య బృందం బిపి, షుగర్, జనరల్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన రావటం ఆనందంగా ఉందని అన్నారు. తిరుపతిలో ప్రముఖ హాస్పిటల్స్ వారు సహకరించి వారి వైద్య బృందాన్ని పంపడం హర్షించదగ్గ విషయమని అన్నారు. వైద్య శిబిరానికి సహకరించిన ఫాదర్ సుసైనాథన్, ఫాదర్ సైమన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలియన్ రాజు, ప్రేమ్ కుమార్, జయరాజ్ ప్రభు పాల్గొన్నారు.

## ప్రజల విన్నపాలను ఓపికతో విన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ

### ప్రతి సమస్యకు పరిష్కారాన్ని చూపిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు



చిత్తూరు, స్వర్ణ సాగరం,ఆగస్టు 31

చిత్తూరు లక్ష్మీ నగర్ కాలనీ లోని చిత్తూరు ఎంపీ కార్యాలయం ప్రజలతో క్రిక్కిరిసింది. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ప్రజలు తమ అభిమాన నేత, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావును కలిసి తమ విన్నపాలను విన్నవించుకునేందుకు క్యూ కట్టారు. వినతిపత్రాలను ఎంపీ దగ్గుమళ్ళకు అందించి , తమ కష్టాలను చెప్పుకున్నారు. దీనికి సానుకూలంగా స్పందించిందిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.వారి ఇబ్బందులని ఓరిమితో విన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారాన్ని చుపారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజాసేవే తనకు పరమావధి అన్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని నలుమూల నుంచి వచ్చిన ప్రజలకు బాసటగా నిలవడమే తన ప్రధమ కర్తవ్యం అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేయడం సంతృప్తిగా ఉందని ఎంపీ తెలిపారు.

## 16 మందికి గొడుగులు పాదరక్షలు పంపిణీ



కోట స్వర్ణసాగరం ఆగష్టు 31

కోట మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కోటమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామ థార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 16 మందికి గొడుగులు,పాదరక్షలు అందజేశారు. తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఆవుల సుబ్బయ్య,కోటమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో పదివేల రూపాయల విలువచేసే గొడుగులు,పాదరక్షలను శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి సంస్థ అధ్యక్షులు అల్లం రమణయ్య, ప్రగతి విద్యాసంస్థల అధినేత పసుపులేటి కిషోర్ చేతులమీదుగా అందజేశారు,ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పెళ్లూరు కోటేశ్వర రెడ్డి,బాబూరావు,పన్నగ సాయి,సంస్థ ప్రతినిధులు దీవి అనంతబాబు, హేమంత్ శర్మ,నరేష్ శర్మ, సాయిబాబు,నందకుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# కోలా ఆనంద్ దంపతుల వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ దంపతులకు వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఇలాంటి శుభ సందర్భాలను ఇంకెన్నో జరుపుకోవాలని, వాయు లింగేశ్వర స్వామి వారి ఆశీస్సులు సదా కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు చొక్కాని రామ్మూర్తి, నాగలాపురం గోవర్ధన్, జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, పట్టణ అధ్యక్షులు హరీష్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగా బత్తిని గోపాల్, మాజీ ప్రధాన కార్యదర్శి కోనేటి అయ్యప్ప, ప్రధాన కార్యదర్శులు చందు రాయల్, సిద్దు రాయల్, పట్టణ యువ మోర్చా అధ్యక్షులు( తానికొండ్ల భరత్ కుమార్ నాయుడు), ఓబీసీ మోర్చా అధ్యక్షులు కన్నా వెంకటేశ్వర్లు, మోదుగుల నాగరాజు, యువ మోర్చా సభ్యులు రవి రాయల్, చోటు, బిందు రాయల్, నానీ, శివా రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబును విమర్శించే అర్హత చిందేపల్లికి లేదు



పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు31.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్ నాయుడును విమర్శించే అర్హత వైకాపా నాయకుడు చిందేపల్లి మధుసూదన్ రెడ్డికి లేదని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఆయన పునబాకలో విలేకరులతో మాట్లాడారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుడుగా, నాలుగుసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రపంచ స్థాయి మేధావుల్లో ఒకరిగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా, స్వర్ణాంధ్రప్రదేశ్ ప్రధాతగా ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ను విమర్శించే అర్హత మధుసూదన్ రెడ్డికి లేదన్నారు. పార్టీ సీనియర్ నేత పోలయ్య మాట్లాడుతూ రాజకీయ గుర్తింపు కోసం లేని పోలింగ్ మాటలు మాట్లాడే మధుసూదన్ రెడ్డికి ఇది మంచి పద్ధతి కాదన్నారు. మరో మారు లేనిపోని ఆరోపణలు చేస్తే మండలంలో తిరిగి అవకాశం కూడా లేకుండా అడ్డుకుంటామని తెలిపారు. పార్టీ నాయకుడు కృష్ణమనాయుడు మాట్లాడుతూ వార్డు మెంబరు గెలవలేని చిందేపల్లి సొంత ఊర్లో ఉనికి లేకుండా రాష్ట్రస్థాయి ఉపన్యాసాలు ఇవ్వడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరి నాయుడు, వేణు రెడ్డి తదితరులు ఉన్నారు.

# పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి, పవర్ స్టార్ శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న రక్తదాన శిబిరం నిర్వహించబడుతుంది. ఆయన అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు, కూటమి నాయకులు మరియు సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలయ్యేందుకు సాదరంగా ఆహ్వానించబడుతున్నారు. మీ పేట బ్రదర్స్.

శ్రీమతి డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమ నిర్వాహకులు మరియు జనసేన పార్టీ నాయకులు, శ్రీకాళహస్తి నియోజకవర్గం వారిచే ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. వేదిక: రోటరీ క్లబ్, శ్రీరామ్ నగర్ కాలనీ.సమయం: ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు.మీరు చేసే ఈ సేవ ద్వారా ప్రాణదాతలు అవుతారని ఆశిస్తూ, పేట బ్రదర్స్ మిత్ర బృందం. మీ సహకారం మాకు ఎంతో విలువైనది. ధన్యవాదములు.

# తిరుపతి జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కె. జనార్ధన్ రెడ్డి నియామకం

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె. జనార్ధన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్ రావు , అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. బత్తైయ్య నాయుడు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శాలువాతో సత్కరించి, కె. జనార్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. బత్తైయ్య నాయుడు సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, కె. జనార్ధన్ రెడ్డి గత 35 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి అవిరళంగా సేవలందిస్తున్నారని కొనియాడారు.

అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో వడివేలు, ఏర్పేడు మండల అధ్యక్షులు, కూలి. రవికుమార్, శ్రీ ఈర్ల. గోపి, శెట్టిపల్లి .శివ, ఎస్. నాగూర్ అయ్యా, శ్రీ వీర రాఘవరెడ్డి, సురేష్, రమణయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి గణేష్ నిమజ్జనం







## ఊరేగింపులో పాల్గొన్న వైయస్ఆర్‌సీపీ ఇంచార్జి దద్దాలుచైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 31

కనిగిరి మున్సిపాలిటీ పరిదిలో గల1,16 వ వార్డులల్లోగణేష్ మండపాలను కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్,నాయకులు సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి కృపా కరుణ కటాక్షాలు నియోజకవర్గం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని,తొలిపూజ అందుకునే ఆ గణనాథుని దయతో ఏ విఘ్నాలు కలుగకుండా అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో విలసిల్లాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశా రు. అనంతరం బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి,సూరసాని మోహన్ రెడ్డి,పెద్దిరెడ్డి ఒకే రెడ్డి,వైసీపీ ఎస్సి సెల్ కార్యదర్శి కటికల వెంకట రత్నం, ద్రోనాథుల చెంచులు, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి,డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి,ముల్లంగి శ్రీహరి రెడ్డి ,పలుకూరి భాస్కర్, మూలే రాజశేఖర్ రెడ్డి,ప్రముఖ కాంట్రాక్టర్ తూ ము వెంకట కృష్ణారెడ్డి, జిలానీ,దాదిరెడ్డి మలకొం డారెడ్డి, గోడి నారాయణ రెడ్డి,పసుపులేటి అరునోదర్,అయి మల్ల నాగమణి షేక్ షకీల, సుస్మిత,లక్ష్మి, షేక్ ఖాదర్ జిలాని పాల్గొన్నారు.

# పి. ఆర్.సి,అత్యాచారాల నిరోధక చట్టాలపై అవగాహన




కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 31

చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు.రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జడ్జి బి. రూపశ్రీ నేతృత్వంలో ఆదివారం కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూఎస్సీ,ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అన్యాయాలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో, వాటి నిరోధానికి ప్రభుత్వం పలు చట్టాలు అమలు చేస్తోందని అన్నారు. పి.సి.ఆర్. చట్టం %–% 1955 ద్వారా అస్పృశ్యత నిర్మూలనకు, ఎస్సీ, ఎస్టీల (అత్యాచారాల నిరోధక) చట్టం %–% 1989 ద్వారా కులాధారిత హింస, అవమానాలు, భూముల హరణ, సామాజిక బహిష్కరణ వంటి దౌర్జన్యాలను అరికట్టేందుకు ప్రత్యేక నిబంధనలు కల్పించబడ్డాయని అవగాహన కలిగించారు.బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుసయ్యద్ షాహిద్ మాట్లాడుతూ ఈ చట్టాల ప్రకారం బాధితులకు తక్షణ ఉపశమనం, పునరావాసం కల్పించబడుతుందని అన్నారు. నేరస్తులపై తక్షణ అరెస్టు, ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా వేగవంతమైన విచారణ జరుగుతుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఈ చట్టాలపై అవగాహన పెంచుకుని, ఎస్సీ, ఎస్టీలపై జరిగే దౌర్జన్యాలను నిరోధించేందుకు ముందుకు రావాలని సామాజిక సమానత్వం, న్యాయం, గౌరవం సాధనలో ఇది ప్రతి పౌరుని బాధ్యత అని తెలిపారు. కార్యక్రమం లో పారా లీగల్ వాలంటీర్లు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు,ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ చైర్మన్ గంధం శ్యాముల్ గెర్షోమ్, అర్నూరి తిరుపతయ్య, పోలీస్ శాఖ సీతారాం, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో చెరువులో పడి వ్యక్తి మృతి

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 31



బంగారుపాలెం మండల పరిధిలోని మొగిలి వద్ద గల గౌనిచెరువు నందు ఆదివారం మొగిలిమిట్టూరు గ్రామానికి చెందిన రాజేష్ కుమారుడు సురేష్ చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాద వసాత్తూ చెరువులో పడి చనిపోవడం జరిగిందని బంగారుపాళ్యం అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు సురేష్ మృతిపై ఎవరు పిర్యాదు చేయలేదని సీఐ తెలిపారు

# శ్రీకాళహస్తి మండలం, చుక్కల నిడిగల్లు గ్రామంలో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి మండలం, చుక్కల నిడిగల్లు గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు ఈనెల 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఘనంగా జరిగాయి. ప్రతిరోజూ వినాయకునికి విశిష్ట నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు విగ్రహ ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమానికి టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి, శ్రీకాళహస్తి రూరల్ సిఐ గోపి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయని, ఈ కార్యక్రమానికి హాజరు కావడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో మరియు గ్రామీణ ప్రాంతాలలో వినాయక చవితి వేడుకలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జనం సజావుగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిఐలు సూచించారు. తరతరాలుగా పూరిహిల్ నుండి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, గ్రామాల సమిష్టి కృషితో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని వారు ప్రశంసించారు. చుక్కల నిడిగల్లుకు చెందిన చుక్కల పవన్ కుమార్, ఖుషి, నవీన్, భరత్, వినయ్, కార్తీక్, సిద్ధు, సునీల్, రేవంత్, హరీష్, చరణ్, ప్రేమ్, మనోజ్, పవన్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. ఐదు రోజుల పాటు ప్రతిరోజూ ఒక ప్రత్యేక వంటకాన్ని నైవేద్యంగా సమర్పించి వినాయకునికి పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

# గణనాధుని సేవలో మోతుకూరి సోమశేఖర్ నాయుడు



కాణిపాకం, ఆగస్టు 31 స్వర్ణ సాగరం

గణనాధుని సేవలో మోతుకూరి సోమశేఖర్ నాయుడు. కాణిపాకం ఆదివారం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న ఐరాల మండలం తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం పొంది స్వామివారి ప్రసాదాల అందుకున్నారు .

# బంగారుపాళ్యం ఎన్ పి ఎస్ కాలనీలో వినాయక నిమజ్జనం కార్యక్రమం





**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 31**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రం లోని ఎన్ పి ఎస్ కాలనీ నందు వినాయక నిమజ్జంలో భాగంగా 5 వ రోజు ఆదివారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం లో స్వామివారి లడ్డు వేలం వేయగా కళ్యాణ్ అభయ ట్రస్టు ఎన్నారై వల్లేరు కళ్యాణ్ 30 వేల రూపాయలకు లడ్డును స్వాధీనం చేసుకున్నారు చివరి రోజు వినాయక నిమజ్జంలో భాగంగా, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి కళ్యాణ్ అభయ ట్రస్ట్ అధినేత కళ్యాణ్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు.కాలనీ వాసులు మహిళలు రంగులు చల్లుకుంటూ వినాయక స్వామి వారి ముందు నృత్యలు చేసారు అనంతరం మేళ తాళాలతో బ్యాండ్ వాయిద్యాలతో బాణాసంచా పేలుస్తూ, రెండు జెసిబి లతో స్వామి వారి విగ్రహానికి పూలు చల్లుతూ ముంగర మడుగు వద్ద గల వెంకటప్ప నాయన చెరువు నందు నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో సూరి నాయుడు, మాధవ నాయుడు,రామయ్య నాయుడు, ప్రకాష్ నాయుడు ,కృష్ణమూర్తి నాయుడు, లోక నాథ నాయుడు,కొండేటి శివ, గోపి నాయుడు, ఉమా పతి నాయుడు, కోదండ నాయుడు, చెన్నకేశవ నాయుడు, మాజీ సర్పంచ్ కమల్నాదరెడ్డి,హేమచంద్ర నాయుడు,జిరాక్స్ సాయి, కమలాపతి నాయుడు,డాక్టర్ శేషాద్రి నాయుడు, సుధాకర్ నాయుడు,బొమ్మయిపల్లి నరేష్ తదితర ఎన్పీఎస్ కాలనీ నందుగల మహిళలు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కోడూరు చెరువు కింద 4700 ఎకరాల ఆయకట్టు సాగు బడి




## కోడూరు ఈదూరుజాయింట్ చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 31**

మండలం లోని కోడూరు ఈ దూరుజాయింట్ చెరువు కింద దాదాపు 4700 ఎకరాల ఆయకట్టు సాగవుతుందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.1500 ఎకరాలను కోడూరు ఈదూరువిలుకానిపల్లిమాచర్ల వారి పాలెం రైతులు సాగు చేసుకుంటున్నట్లుతెలిపారు.ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండాఒక పంట పండించుకునే విధంగా నిర్ణయం తీసుకోవడంతో పేద వర్గాలు చెరువు ద్వారా సాగుబడి చేసుకోవడం జరిగిందన్నారు .గతంలో ఉమ్మడి రాష్ట్రం పాలనలో తానుమంత్రులుగా ఉన్న తుమ్మల నాగేశ్వర రావు కడియం శ్రీహరి మండవ వెంకటేశ్వర రావును తీసుకొచ్చి కోడూరు చెరువుకాలువ సిస్టం మార్పులకు రూతొమ్మిది కోట్లు ఖర్చుపెట్టినట్లు వివరించారు.సోమశిల జలాశయంలో నీటి నిల్వ 62 టీఎంసీలు దాటగా కండలేరు 36 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.రాబోవు సీజన్లో 7లక్షల ఎకరాలలో పంట పండించుకొన్ని అవకాశం ఉందన్నారుఈ పరిశీలనలోటిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర జాఫర్సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోడూరు సాగునీటి సంఘం అధ్యక్షులు ఆర్ బాబు నాయుడుకోడూరు మాజీ నీటి సంఘం అధ్యక్షులు వీరబోయిన గంగాధర్ కోడూరు శ్రీనివాసుల రెడ్డి మన్నెంజితేంద్ర చింతా సీతారామయ్యతంబిరెడ్డి వెంకటేశ్వర్లు బత్తల వెంకటరమణయ్య స్థానిక రైతులు పాల్గొన్నారు

# గంగవరంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

## యువతతో కలిసి సరదాగా స్టెప్ వేసిన శింగారెడ్డి లక్ష్మీ నరసారెడ్డి....

### గ్రామంలో అంబరాన్నంటిన సంబరాలు.



**కోవూరు, స్వర్ణ సాగరం, ఆగష్టు 31:**

కోవూరు మండలం, గంగవరం గ్రామంలో వినాయక చవితి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. స్థానిక యువత ఈ ఉత్సవాలను ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు.భారీ ఊరేగింపు, ప్రత్యేక పూజలువినాయకుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై కొలువుదీర్చి, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. డీజే, తప్పెట్లు, బాణాసంచా పేలుళ్లతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు.

యువత తో శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి ....ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పాటూరు నీటి సంఘాల ఉపాధ్యక్షులు శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక యువత ఆయనను సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు. యువతలో ఉత్సాహాన్ని నింపేందుకు ఆయన డీజే పాటలకు పిల్లలతో కలిసి సరదాగా స్టెప్పులేశారు. ఇది గ్రామంలో పండుగ సందడిని మరింత పెంచింది.ఈ కార్యక్రమంలో స్థానిక యువకులైన మన్నేపల్లి నాగేంద్రబాబు, తలారి బాబ్జి సహా పలువురు గ్రామ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి పండుగలో పాల్గొనడంపై యువత తమ సంతోషాన్ని వ్యక్తం చేసింది.

# తవణంపల్లె మండలంలో ఘనంగా గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు



**స్వర్ణ సాగరం తవణంపల్లె ఆగస్టు 31**

పూతలపట్టునియోజకవర్గం తవణంపల్లె మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు అందులో భాగంగా తవణంపల్లెలో గల గాయత్రి మిల్క్ డైరీ లో గల వినాయక విగ్రహానికి గత ఐదు రోజులుగా పూజలు చేస్తూ ప్రసాదాలు పంచి పెడుతూ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తూ ఈరోజు ఆదివారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు స్వామివారికి ధూపదీప నైవేద్యం సమర్పించి కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం స్వామివారిని ట్రాక్టర్ పై ఉంచి డప్పులు మేళ తాళాలు డ్రమ్ములు నడుమ బాణాసంచా కాలుస్తూ ఊరేగింపుగగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అదేవిధంగా తవణంపల్లె, అరగొండ, వెంగంపల్లె, సరకళ్ళు, కృష్ణాపురం తదితర గ్రామాల్లో ఘనంగా వినాయక నిమజ్జనం కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో వినాయక భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ అభయ వినాయకుని ఆశీర్వాద చిరు సత్కారం అందుకున్న జర్నలిస్టు




**రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 31**

రేణిగుంట జి.ఎం స్ట్రీట్ లో గత ఐదు రోజులుగా శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అసోసియేషన్ సభ్యులు ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివ మూర్తి, రేణిగుంట జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు ఉమేష్, అసోసియేషన్ ట్రెజరర్ శివకుమార్, జాయింట్ సెక్రటరీ సత్యరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణంరాజు లను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించి ప్రసాదాలను అందించారు. ముందుగా గణనాథుడి కి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అభయ వినాయక అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, ముఖ్య సలహాదారులు జూలియన్ రాజు, కమిటీ సభ్యులు సుమన్, పవన్, కళ్యాణ్ ప్రభు, ధనుంజయ, వినోద్, నితిన్, దినేష్, సుబ్బు, హేమాద్రి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాము - డిల్లీబాబు రెడ్డి పిలుపు




**రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 31**

మీడియా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిల్లీబాబు రెడ్డి పిలుపునిచ్చారు. ఏపి ఎంఎఫ్ తిరుపతి జిల్లా కమిటి కార్యవర్గ సమావేశం మామండూరు ఫారెస్ట్ గెస్ట్ హౌస్ లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిల్లీబాబు రెడ్డి మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి సభ్యత్వం పెంచుకుంటూ వెళ్లాలని, నిరంతరం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు ఇటు అధికారుల దృష్టికి అటు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కల్లుపల్లి సురేంధర్ రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షులు శివమూర్తి, కార్యదర్శి తిరుపాల్, ట్రెజరర్ సోమశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు జయశంకర్, పరంధామ రెడ్డి, మనోహర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మునిచంద్రా రెడ్డి, కార్యవర్గ సభ్యులు చంద్రకళా రెడ్డి, కళ్యాణ్, మోహన్, జయచంద్ర, సాయికుమార్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

# గణేశుడికి విశేష పూజలు

## భారీ అన్నదానం...

### హాజరైన పాటూరు నీటి సంఘాల ఉపాధ్యక్షులు సింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి..



**కోవూరు, స్వర్ణ సాగరం, ఆగష్టు 31:**

కోవూరు మండలం గంగవరం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు ప్రతి చోట అంభరాన్ని అంటుతున్నాయి.. గ్రామంలోని రెడ్డి గారి సందున బిసి కాలనీలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మన్నేపల్లి నాగేంద్రబాబు ప్రత్యేక ఆహ్వానం మేరకు పాటూరు నీటి సంఘాల ఉపాధ్యక్షులు శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యారు.. స్వామి వారిని దర్శించుకున్నారు. సాంప్రదాయ బద్ధంగా, వేదమంత్రాల నడుమ తెలుగుదేశం పార్టీ నాయకులు లక్ష్మీ నరసారెడ్డిని ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు. అన్నదానంలో పాల్గొన్నారు. గ్రామం సెంటర్లోలో జరిగిన గణేశుడి ఉత్సవాల్లో శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి భారీగా బాణాసంచా ను అందించిన విషయం తెలిసిందే.

## కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం నుండి గణనాథని బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పణ



**కాణిపాకం , ఆగస్టు 31 స్వర్ణ సాగరం**

కాణిపాకం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం నుండి వరసిద్ధి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పణ. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నుండి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించిన కసాపురం దేవస్థానం ఈ.వో విజయ రాజు , స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎస్ వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, ప్రసాద్, ధనపాల్, కసాపురం ఏఈఓ వెంకటేశ్వరుడు, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారికి ఆరు గొడుగులు విరాళం



**కాణిపాకం, ఆగస్టు 31 స్వర్ణ సాగరం**

స్వామివారికి ఆరు గొడుగులు విరాళం. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా ఆదివారం స్వామివారికి గ్రామోత్సవాలకు ఉపయోగించు నూతన 6 గొడుగులు విరాళం అందజేశారు, దాత కుమార్ స్వామి నాయుడు , చిత్తూరు కొంగ రెడ్డి పల్లె వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, వాసు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## సాయి నగర్ లో కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ప్రత్యేక పూజలు

### వేద పండితులచే ఆశీర్వాదం

### ఘనంగా సన్మానించిన సాయి నగర్ గణపతి ఉత్సవ కమిటీ



**కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 31**

కనిగిరి సాయి నగర్ లో ఆదివారం గణేష్ ఉత్సవాల సందర్భంగా కనిగిరి డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్ మరియు వారి తండ్రి సుబ్బారావు కనిగిరి ఎస్సై శ్రీరామ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు, సాయి నగర్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు సింగంపల్లి రాంప్రసాద్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్ రెడ్డి , బొప్పరాజు సుబ్బారావు చీమలమర్రి నాగ ప్రసాద్ కృష్ణమూర్తి సురభి ,సురేష్, ఆర్వీ సుబ్బయ్య, నామ వెంకటేశ్వర్లు, పైడా ప్రసాద్, బత్తుల ప్రసాదు, సురభి సాయి సుబ్రహ్మణ్యం శర్మ వేద పండితులు గారి సారధ్యంలో కనిగిరి డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్ గారిని మరియు డి.ఎస్.పి తండ్రిగారైన సుబ్బారావు గారిని మరియు కనిగిరి ఎస్సై శ్రీరాం గారిని కమిటీ ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల మల్లికార్జునరావు, కనిగిరి బ్రాహ్మణ సంఘం నాయకులు సాదు చలపతిరావు, లోకా రమేష్, పావని మురళి, విసి రామశాస్త్రి, కారుమంచి సాయి, బొప్పరాజు పని, విటపు గోపి, రవి శర్మ బత్తుల సునీల్, గోన దానయ్య,, వరమ్మ, శైలజ, రాజేశ్వరి, శ్రావణి, ప్రసన్న, ధూళిపాళ్ల లీలమ్మ శ్రీదేవి,తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన - ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆవుల శ్రీనివాసుల రెడ్డి



**కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 31**

కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ స్టేట్ బ్యాంకు సమీపంలో గణేష్ మండపాన్ని కనిగిరి శ్రీ హర్షిత మల్టి స్పెషలిటీ హాస్పెటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆవుల శ్రీనివాసుల రెడ్డి%ఢ%కుటుంబ సభ్యులు విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి కృపా కరుణ కటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని,ఆ గణనాథుని దయతో ఏ విఘ్నాలు కలుగకుండా సుఖశాంతులతో విలసిల్లాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది.

# నర్రావుల ఇంట సందడే సందడి





**పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు31.**

తెలుగుదేశం పార్టీ యువజన నాయకుడు నర్రావుల లోకేష్ నాయుడు ఇంట ఆదివారం కోలాహలంగా పండుగ వాతావరణం నెలకున్నది. పునుబాక గ్రామంలో లోకేష్ నాయుడు రాజేశ్వరి దంపతుల పిల్లలు హవీష్, రక్షిత లకు కేశఖండన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నారులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విచ్చేసిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సిరసనంబేటి విజయ భాస్కర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సర్పంచులు దేవారెడ్డి నాగేంద్ర రెడ్డి, మునిష్, టిడిపి యువజన నాయకులు శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, దువ్వూరు రాకేష్ రెడ్డి చిన్నారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వేర్వేరు ప్రాంతాల నుంచి విచ్చేసిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కావడంతో పునబాక గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఈ కార్యక్రమంలో స్వర్ణముఖి ఆయకట్టు మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు, పార్టీ నాయకులు యోగాని బెన్నీ, పోలయ్య, హరి నాయుడు, వేణు రెడ్డి, కృష్ణమ నాయుడు, నర్రావుల మోహన్ నాయుడు, విజయమ్మ, నరాల హరీ ష్, కిషోర్, మురళి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం బంగారు చిన్న శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన ఘననాథుడు





**కాణిపాకం , ఆగస్టు 31 స్వర్ణ సాగరం**

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం బంగారు చిన్న శేష వాహనంపై కాణిపాకం గ్రామ పురవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చిన గణనాథుడు. కాణిపాకం కాకర్ల వారి పల్లి వడ్రంపల్లి మిట్ట ఇండ్లు కొత్తపల్లె అడప గుండ్లపల్లె 44 బొమ్మసముద్రం తిమ్మాజి పల్లె చికర పల్లె అగరంపల్లె గ్రామాధుల కమ్మ వంశస్థులు ఉభయదారులగా వ్యవహ రించారు. ఈ మేరకు వారు ఉదయం 1000, కు పైగా కలిశాలతో మాడవీధుల మీదుగా ఆలయానికి చేరుకోగా కలశాలు వరుస తీసుకురాగా అర్చక స్వాములు కళ్యాణ వేదిక మీద స్వామివారి మూలవిరాట్ కు పంచామృతం అభిషేకం నిర్వహించి చక్కగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ధూప దీప నైవేద్యములను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో పూత లపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ చైర్మన్ దీపా వెంకట్, ఐరాల మండలం మండలాధ్యక్షుడు గంగారాపు హరి బాబు నాయుడు, ఐరాల జడ్పిటిసి వి. సుచిత్ర కన్నయ్య నాయుడు, ఆలయ కార్య నిర్వహణ అధికారి పెంచల కిషోర్ ఆలయ అధికారులు, ఆలయ ఉభయదారుల అధ్యక్షులు బుజ్జి నాయుడు, ఆలయ సంబంధిత అధికారులు, కమ్మ వంశస్థుల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పదవులకు గుర్తింపు తెచ్చేలా సేవ చేయాలి



### ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కొత్తగా పదవులు అలంకరిస్తున్న నాయకులందరూ తమ పదవులకు వన్నె తెచ్చేలా, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకునేలా ప్రజాసేవ చేయాలని సూళ్లూరుపేట శాసన సభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ వెల్లడించారు. చిల్లకూరు కేంద్ర సహకార సంఘం అధ్యక్షులుగా (పి ఏ సీ ఎస్ )రావులపాడు గ్రామానికి చెందిన కె.వి నాయుడు నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా కె.వి నాయుడు మిత్ర బృందం కలిసి ఎమ్మెల్యే విజయశ్రీని, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ను శాలువాలు పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. చాలా కాలంగా తెలుగుదేశం పార్టీ యువ నాయకుడుగా ఉంటూ పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి ఎక్కువగా కృషి చేసిన కె.వి నాయుడుకు తగిన సమయంలో మంచి పదవి అలంకరించినట్లు ఆమె ప్రశంసించారు. మండలంలోని రైతులందరికీ అందుబాటులో ఉంటూ, రైతుల అభివృద్ధితోపాటు ప్రజాసేవ చేయడం వల్ల మంచి గుర్తింపు లభిస్తుంది అన్నారు. ఎప్పటికప్పుడు రైతుల సమస్యలను తెలుసుకుని వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించేలా పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నర్రావుల మోహన్ నాయుడు, చక్రపాణి నాయుడు, వెంకటరత్నం నాయుడు, ప్రదీప్ నాయుడు, భాస్కర్, మహేష్ నాయుడు, చంద్రయ్య నాయుడు, వెంకటాద్రి నాయుడు, పెంచల్ నాయుడు, బాబు నాయుడు, ఎల్.వి నాయుడు, మహేష్ నాయుడు, రమేష్ నాయుడు, సురేష్ నాయుడు, రామచంద్రయ్య, చెంచయ్య, మస్తాన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంతో పాటు పర్యావరణంలో కాలుష్యాన్ని తగ్గించవచ్చు

### కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ ఈశ్వంత్





**కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 31**

సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంతో పాటు పర్యావరణ ములో కాలుష్యం తగ్గించ వచ్చని కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యస్వంత్ అన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు పిలుపునకు స్పందిస్తూ ఈ ఆదివారం సైకిల్ పై కార్యక్రమాన్ని కనిగిరి సర్కిల్ పోలీస్ స్టేషన్ నందు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వ%శ్%త్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో వాహనాలు వినియోగం పెరగడంతో కాలుష్యం ఎక్కువ అవుతుందని సైక్లింగ్ చేయడం వల్ల కాలుష్య నియంత్రనకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పెంపొందించు కోవడంతో పాటు పర్యావరనాన్ని రక్షించుకోవచ్చని ఆయన తెలిపారు."పోలీసు సిబ్బంది ప్రజా భద్రత కోసం 24 గంటలూ పనిచేస్తారు. వారికి శారీరక దృఢత్వం మరియు మానసిక శ్రేయస్సు చాలా ముఖ్యమైనవి. సైక్లింగ్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఒత్తిడిని కూడా తగ్గిస్తుందని, పోలీసులు మెరుగైన సేవలందించేందుకు వీలు కల్పిస్తుందని ఆయన అన్నారు.పౌరులు తమ జీవనశైలిలో ఫిట్‌నెస్‌ను చేర్చుకోవాలని "పోలీసులు మాత్రమే కాదు, సాధారణ ప్రజలు కూడా ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. ప్రతి ఒక్కరూ వారానికి కనీసం ఒక రోజు సైక్లింగ్, వ్యాయామం లేదా ఏదైనా రకమైన శారీరక శ్రమకు కేటాయించాలి" అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కనిగిరి సీఐ ఖాజా వలి ఎస్సైలు శ్రీరామ్, మాధవ్ రావు,కోటయ్య,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# సక్సెస్ అంటే డబ్బు, పేరు కాదు.. అలాంటి సినిమాలు చేయాలనుంది!

రకుల్ ప్రీత్ సింగ్.. పేరు వినగానే, హీరోయిన్‌గానే కాకుండా ఫిట్‌నెస్ అండ్ హెల్త్ గుర్తొస్తుంది. ఆమె గురించి తెలుసుకోవాలంటే ఎప్పటికప్పుడు కొత్త విషయాలు ఉంటూనే ఉంటాయి. నటిగానే కాకుండా ఆమె ఫిట్‌నెస్, డ్యాన్స్, స్పోర్ట్స్, సోషల్ యాక్టివిటీస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో తనకంటూ ప్రత్యేకతను ఏర్పరచుకుంది. రకుల్ గురించి ఇంకొన్ని విషయాలు... రకుల్ ప్రీత్ సింగ్ న్యూఢిల్లీలోని సిక్కు కుటుంబంలో పుట్టింది. ఆమె తండ్రి కుల్వీందర్ సింగ్ ఆర్మీ ఆఫీసర్‌గా పని చేసేవారు. దాంతో ఆమె ఆర్మీ స్కూల్‌లోనే స్కూలింగ్ చేసి, ఆపైన జీసస్ అండ్ మేరీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. రకుల్ ప్రీత్ జాతీయ స్థాయి గోల్ఫ్ ప్లేయర్. అంతేకాదు, ఎంతో ఆసక్తితో భరతనాట్యం కూడా నేర్చుకుంది. అలాగే ఆమెకు గుర్రపు స్వారీ చేయడం కూడా చాలా ఇష్టం. మోడలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాక, రకుల్ 18 ఏళ్లకే కన్నడ సినిమా 'గిల్లి' ద్వారా ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో నటించి.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్ల జాబితాలో చేరిపోయింది. 'ఫెమినా' మిస్ ఇండియా%–%2011లో రకుల్ ఐదో స్థానంలో నిలిచింది. అందులోనే పాంటలూన్స్ మిస్ ఫ్రెష్ ఫేస్, ఫెమినా మిస్ టాలెంటెడ్, మిస్ బ్యూటిఫుల్ స్మైల్, మిస్ బ్యూటిఫుల్ ఐస్, పీపుల్స్ చాయిస్ మిస్ ఇండియా టైమ్స్ వంటి టైటిల్స్ గెలుచుకుంది. 'మనకంటూ ప్రత్యేకంగా టైమ్ కేటాయించుకోవాలి. ఎవరి సంతోషం వాళ్ల చేతుల్లోనే ఉంటుంది. దానికోసం ఎవరిపైనా ఆధారపడొద్దు' అన్నది రకుల్ అభిప్రాయం. రకుల్ తన సామాజిక బాధ్యతను ఎప్పుడూ మరిచిపోలేదు. కోవిడ్ సమయంలో వంద కుటుంబాలను ఆదుకోవడమే కాకుండా, క్రౌడ్ ఫండింగ్ చేసి పేదలకు డొనేషన్స్ అందించింది. 2017లో రకుల్ 'తెలంగాణ బేటీ బచావో, బేటీ పఢావో' ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్‌గా అపాయింట్ అయింది. 2024లో తను ప్రేమించిన జాక్కీ భగ్నానీని గోవాలో వివాహం చేసుకుంది. మొదట ఓవర్సీస్‌లో పెళ్లి వేడుకలు జరపాలనుకున్నారట! కాని, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడాలనే ఆలోచనతో గోవాలోనే ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. 'సక్సెస్ అంటే పేరు, డబ్బు కాదు. మనసుకు నచ్చిన పని చేస్తూ ప్రశాంతమైన జీవితాన్ని గడపడం. చిన్నప్పటి నుంచి నాన్న నుంచి వచ్చిన డిసిప్లిన్, పంక్చువాలిటీ నన్ను ఎప్పటికీ హ్యాపీ లైఫ్ వైపే తీసుకెళ్తాయి. ఇష్టం దానివల్లే చేయాల్సిన పనిలో రెండు నిమిషాలు ఆలస్యమైనా నాకు ప్యానిక్ అటాక్ వచ్చేస్తుంది. సోషల్ ఎంటర్‌టైనర్స్ చేయడం నాకు చాలా ఇష్టం. వాటితో సమానంగా సోషల్ రెస్పాన్సిబుల్ సినిమాలూ చేయాలని ఉంది. ఫ్యాషన్, డ్రెస్సింగ్ విషయానికొస్తే, నాకు ఏది కంఫర్ట్ ఉంటే అదే ఎంచుకుంటాను' అని చెబుతుంది



# రేసు ట్రాక్ లవ్‌స్టోరీ.. నిశ్చితార్థం, పెళ్లి ఎప్పుడంటే?

టాలీవుడ్ హీరోయిన్ నివేతా పేతురాజ్ ప్రేమలో ఉంది. వినాయక చవితి సందర్భంగా తన ప్రియుడిని పరిచయం చేసింది. దుబాయికి చెందిన బిజినెస్‌మ్యాన్ రజిత్ ఇబ్రాన్‌తో రిలేషన్‌లో ఉన్నాననే విషయాన్ని అధికారికంగా బయటపెట్టింది. అయితే అసలు ఈ ప్రేమకథ ఎప్పుడు మొదలైంది? ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? తదితర విషయాల్ని ఇప్పుడు స్వయంగా నివేతా రివీల్ చేసింది. మధురైలో పుట్టి పెరిగిన నివేతా.. 2016లో ఓ తమిళ సినిమాతో నటిగా మారింది. 'మెంటల్ మదిలో' అనే మూవీతో తెలుగులోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. చిత్రలహరి, బ్రోచేవారెవరా, అల వైకుంఠపురములో, రెడ్, పాగల్, విరాటపర్వం, దాస్ కా దమ్కీ తదితర మూవీస్ కూడా చేసింది. ఓ మాదిరి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతానికైతే ఈమె చేతిలో కొత్త ప్రాజెక్టులేం లేవు. అయితే ఓవైపు నటిస్తూనే దాదాపు ఐదేళ్లుగా ప్రేమలో ఉంది. ఈ విషయాన్ని చాలా రహస్యంగా ఉంచింది. స్వతహాగా హీరోయిన్ అయినప్పటికీ రేసింగ్, బ్యాడ్మింటన్‌లోనూ నివేతాకు ప్రతిభ ఉంది. ఈ క్రమంలోనే ఐదేళ్ల క్రితం దుబాయిలో ఓ రేసింగ్ సందర్భంగా రజిత్‌తో తనకు పరిచయమైందని నివేతా చెప్పింది. తొలుత స్నేహితులుగానే ఉన్నామని, కొన్నాళ్లకు ఇద్దరం అనుకుని ప్రేమికులు అయ్యామని చెప్పింది. తన సర్కిల్‌లో చాలా తక్కువమందికి మాత్రమే తన ప్రేమ గురించి తెలుసని, ఇండస్ట్రీలోనూ ఎవరికీ ఈ విషయం తెలియదని పేర్కొంది. తన ప్రేమ గురించి బయటపెట్టడం తన మేనేజర్‌తో సహా అందరికీ షాక్ అని తెలిపింది. ఇప్పటికే పెళ్లి పనులు కూడా మొదలుపెట్టేశామని చెప్పిన నివేతా.. అక్టోబరులో నిశ్చితార్థం చేసుకుంటామని రాబోయే జనవరిలో పెళ్లి ఉంటుందని పేర్కొంది. తేదీ ఇంకా నిర్ణయించలేదని చెప్పుకొచ్చింది. తమ ఇద్దరి కుటుంబాలు దుబాయిలో ఉంటున్నాయని, అలానే తమ వివాహాన్ని సింపుల్‌గా సన్నిహితుల సమక్షంలో చేసుకుంటామని నివేతా చెప్పుకొచ్చింది.



# అలాంటి దుస్తులు ధరించలేను.. అందుకే 'షో'కి నన్ను పిలవరు బిగ్‌బాస్ ఫేం కీర్తి భట్

బుల్లితెరపై రోజూ రకరకాల షోలు ప్రసారం అవుతుంటాయి. ఒక చానల్‌లో కామెడీ షో..మరో చానల్‌లో డ్యాన్స్ షో.. ఇంకో చానల్‌లో సింగింగ్ షో.. ఇలా నిత్యం పదుల సంఖ్యల్లో షోలు టెలికాస్ట్ అవుతుంటాయి. అయితే ఈ షోలలో ఎక్కువగా సీరియల్ నటీనటులలతో పాటు 'బిగ్‌బాస్' మాజీ కంటెస్టెంట్స్ కనిపిస్తుంటారు. యాంకర్‌గానో..జడ్జిగానో..టీమ్ లీడర్‌గానో..లేదా స్పెష?ల్ గెస్ట్ గానో ఏదో ఒకరకంగా వాళ్లు టీవీల్లో సందడి చేస్తుంటారు. శ్రీముఖి, లాస్య, శివజ్యోతి, అరియానా, శోభా శెట్టి, విష్ణుప్రియ..ఇలా చాలామంది బిగ్‌బాస్ ప్లేయర్స్ ఇప్పుడు వరుస షోలతో బిజీ అయిపోయారు. కానీ బిగ్‌బాస్‌తో ఎంతో పేరు సంపాదించున్న కీర్తి భట్ మాత్రం ఎలాంటి షోలలో కనిపించడం లేదు. బిగ్‌బాస్ షో టెలికాస్ట్ అయ్యే చానల్‌లో సైతం ఆమె కనిపించడం లేదు. తాజాగా దీనికి గల కారణాన్ని బయటపెట్టింది కీర్తి భట్. అందరిలానే తాను గ్లామర్ షో చేయనని..వాళ్లు చెప్పినట్లుగా చిన్న చిన్న దుస్తులు ధరించలేనని..అందుకే తనని ఏ షోకి పిలవరని అంటోంది.

# 'స్పిరిట్' కోసం ప్రభాస్ సరికొత్త లుక్..

## రంగంలోకి ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్.!

టాలీవుడ్ నటుడు, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజాసాబ్', 'ఫౌజీ' సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ రెండు సినిమాలను తొందరగా కంప్లీట్ చేసుకుని త్వరలోనే సందీప్ రెడ్డి వంగతో స్పిరిట్ అనే సినిమా చేయబోతున్నాడు. ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా.. భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్‌తో కలిసి సంయుక్తంగా తెరకక్కిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రాణే సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే ఈ సినిమాలో ప్రభాస్ లుక్స్ ఎలా ఉండబోతున్నాయో అనే ఆసక్తి అందరిలోనూ నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ బయటకి వచ్చింది. ఈ సినిమాలో ప్రభాస్ లుక్స్ కోసం ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హకీమ్ పనిచేయబోతున్నట్లు తెలుస్తుంది. సందీప్ రెడ్డి వంగా గత చిత్రాల హీరోలకు కూడా ఆలిమ్ హకీమ్ లుక్స్ డిజైన్ చేశారు. దీంతో ఈసారి ప్రభాస్‌ను సరికొత్త లుక్‌లో ఎలా చూపిస్తారా అని అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. కాగా దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

